# నృసింహ శతకము

(మూలం: శేషప్ప కవి)

## భావదీపిక

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech




## ప్రార్థన

శా ॥ శ్రీలక్ష్మీనరసింహ చేరి కొలుతున్ సిద్ధించ మోక్షంబునా
బాలున్ "కాశి"ని శాంతి మార్గమునకున్ పంపంగ సంప్రీతుడై
చాలున్ జాలును కోరనింక వరముల్ సర్వేశ్వరా అందుకే
ఈలీలన్ విరచించినాను నికపై ఇంకేమి కోరన్ ప్రభూ?

కం॥ కనులకు కనుపించెదవని
ఘనులెందరొ చెప్పినారు కలిమల హరణా!
వినిమామొర రక్షింపుము
నిను మించిన వెల్పెవండు? నిగమ వినోదీ!



# ముందుమాట

"శేషప్ప కవి" చెప్పిన నృసింహ శతకం నేను బాలునిగా వున్న రోజుల్లో చదివించేవారు. "శ్రీరామ" అని వ్రాయకుండా ఏదీ వ్రాసేవారు కాదు. అపభ్రంశపు మాట వింటే "రామ, రామ" అనేవారు. రాముడి మీద 'ఆన' అంటే సత్యం మాత్రమే చెప్పేవారు. త్రికరణ శుద్ధిగా ధర్మం పాటించకపోతే నృసింహుడు ప్రత్యక్షంగా వచ్చి శిక్షిస్తాడని, అధవా పరోక్షంగా బుద్ధి చెప్పి సత్యం నిలబెడతాడని నమ్మేవారు.

కాలానుగుణంగా హిరణ్యకశిపుని మించిన విలన్లు పెరిగిపోయి, ప్రహ్లాదుని వంటి భక్తులు తరిగిపోయి, పాపభీతి అరిగిపోయి అగమ్యగోచర స్థితిలో ధర్మం అల్లల్లాడుతోంది. దీన్ని ఆపాలనే కాంక్ష ఉన్నా శక్తిలేని వాడిని. ఇలాంటి పుస్తకాలు వ్రాయగలను కాని ఇది చదివి అందరూ బాగుపడండి అని శాసించలేను. సర్వజగద్రక్షకుడే గతి. పోనీ గాంధీ మార్గం నమ్మండి. చెడు వినకండి, చెడు చూడకండి, చెడు చేయకండి. ఇదీ వినకపోతే.. ఓం శాంతి, ఓం శాంతి, ఓం శాంతి.

సీ॥ శ్రీమనోహర! సురార్చిత సింధుగంభీర!
భక్తవత్సల! కోటి-భానుతేజ!
కంజనేత్ర! హిరణ్య-కశ్యపాంతక! శూర!
సాధురక్షణ! శంఖ-చక్రహస్త!
ప్రహ్లాద వరద! పా-పధ్వంస! సర్వేశ!
క్షీరసాగరశాయి! -కృష్ణవర్ణ!
పక్షివాహన! నీల-భ్రమరకుంతలజాల!
పల్లవారుణపాద-పద్మయుగళ!

తే ॥ చారుశ్రీచందనాగరు-చర్చితాంగ!
కుందకుట్మలదంత! వై-కుంఠధామ!
భూషణవికాస! శ్రీధర్మ-పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

శ్రీలక్ష్మి మనస్సును హరించిన నరసింహా! దేవతలచేత కొలువబడు ప్రభూ! సముద్రమువలె గంభీరుడవైన దేవా! ఓ భక్తవత్సలా! ఓ కోటిసూర్యప్రకాశా! ఓ పద్మనేత్రా! ఓ హిరణ్యకశిపాంతకా! ఓ శౌర్యశాలీ! ఓ సాధురక్షకా! ఓ శంఖచక్రధారీ! ప్రహ్లాదునికి వరప్రదాతా! నీవు పాపధ్వంసకుడవు, సర్వేశ్వరుడవు, పాలకడలిపై పవళించు నీలవర్ణుడవు. గరుత్మంతుని వాహనముగాకలవాడవు. నల్లని తుమ్మెదల రంగుకల ముంగురులున్నవాడవు. ఎఱ్ఱని నీ పాద పద్మములు బహు కోమలమైనవి.

శ్రీచందనము అంగములపై ధరించిన ప్రభూ! అరవిరిసిన మొలలవంటి దంతములు కల వైకుంఠపతివి. పెక్కు నగలు ధరించిన ఓ ధర్మపురి నరసింహా! నీవు దుష్ట సంహారివి.



సీ॥ పద్మలోచన! సీస-పద్యముల్ నీమీద
జెప్పబూనితినయ్య!-చిత్తగింపు
గణ యతి ప్రాసవల-క్షణము జూడగలేదు
పంచకావ్య శ్లోక- పఠన లేదు
అమరకాండత్రయ్ - బురసి చూడగలేదు
శాస్త్రీయ గ్రంథముల్ - చదువలేదు
నీ కటాక్షంబున - నే రచించెద గాని
ప్రజ్ఞనాయది గాదు- ప్రస్తుతింప

తే ॥ దప్పుగలిగిన సద్భక్తి- తక్కువౌనె
చెఱకునకు వంకపోయిన - చెడునె తీపు?
భూషణవికాస! శ్రీధర్మ- పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

ఓ పద్మనయనా! నీపై సీస పద్యములు చెప్పదలచితినయ్యా! వాటిని చిత్తగించుము ప్రభూ! నిజానికి నాకు గుణము, యతులు, ఛందస్సు పెద్దగా తెలియదు. పోనీ కవినా? అంటే కాదు, ప్రాసలు తెలియవు. వాటి లక్షణాలు రావు. వాటిని చూడలేదు కూడా. పంచకావ్యాలు చదువుకోలేదు. శాస్త్రములు పఠించ లేదు. మూడు అమరకాండల జ్ఞానము లేదు. నీదయవలన ఈ పద్యములు చెబుతున్నాను. ఇందులో నా గొప్పతనం ఏమీలేదు. ఏదో నిన్ను పొగిడినాను అంతే.

ఇందులో తప్పులున్నా నా భక్తిలో మాత్రం నా లోపం లేదు. చెఱకుగడ వంకరవున్నా తీపిగానే వుంటుందిలే స్వామీ! అనేక నగలను ధరించిన ఓ ధర్మపురి నివాసా, నరసింహా! నీవు దుష్టసంహారివి.

సీ॥ నరసింహా! నీ దివ్య - నామమంత్రముచేత
దురితజాలములన్ని -దోలవచ్చు
నరసింహా! నీ దివ్య- నామమంత్రముచేత
బలువైన రోగముల్ -పాపవచ్చు
నరసింహా! నీ దివ్య-నామమంత్రముచేత
రిపుసంఘముల సంహ-రింపవచ్చు
నరసింహా! నీ దివ్య-నామమంత్రముచేత
దండహస్తుని బంట్ల-దరమవచ్చు

తే ॥ భళిర! నేనీ మహామంత్ర-బలముచేత
దివ్యవైకుంఠ పదవి సా-ధింపవచ్చు
భూషణవికాస! శ్రీధర్మ-పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

ఓ శ్రీనరసింహా! నీ దివ్యనామమంత్రమును పఠించినందు వలన పాపములనెడి వలలనుంచి బయటపడవచ్చును. నరసింహా! నీ దివ్యనామ సంకీర్తనతో దిట్టమైన రోగములను తొలగించుకొనవచ్చును. ఓ నరసింహా! నీ దివ్యనామోచ్ఛారణ చేత, శత్రుమూకలన్నీ సంహరింపబడతాయి. ఓ నరసింహదేవా! నీ దివ్యనామమంత్రబలముతో కాలదండమును ధరించిన యమభటులను పారద్రోలవచ్చును.

భళిభళీ!! నేను నీమహామంత్రమును పలికిన మాత్రమున దివ్యమైన వైకుంఠము సాధించగల అర్హత పొందగలను. అనేక నగలను ధరించిన ఓ శ్రీధర్మపురి నివాసా! నారసింహా! నీవు పాపవిముక్తి కలిగించు దుష్ట సంహారివి.



సీ॥ ఆదినారాయణా!-యనుచు నాలుకతోడ
బలుకనేర్చినవారి-పాదములకు
సాష్టాంగముగ నమ-స్కారమర్పణ జేసి
ప్రస్తుతించెదనయ్య-బహువిధముల
ధరణిలో నరులెంత-దండివారైనను
నిన్ను గాననివారి-నే స్మరింప
మేము శ్రేష్ఠుల మంచు-మిడుకుచుంచెడివారి
చెంత జేరగబోను-శేషశయన

తే ॥ పరమ సాత్వికులైన నీ-భక్తవరుల
దాసులకు దాసుడను సుమీ-ధాత్రిలోన
భూషణవికాస! శ్రీధర్మ-పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ఆదినారాయణా! అంటూ నాలికతో పలుకులు నేర్చిన వారి పాదములకు సాష్టాంగ నమస్కారమాచరించి కీర్తించెదనయ్యా! అనేక విధముల సన్నుతింతును. ఈ భూమిమీద యెంత ధనికులైననూ నిన్ను పూజించని వారిని నేను స్మరింపను. అట్లే మేము చాలా గొప్పవారమని మిడిసిపడేవారి దగ్గరకు కూడా నేను పోనయ్యా ఓ ఆదిశేష శయనా!

ఈ ధరణిపై పరమసాధువులైన నీ దాసులైననూ నీభక్తులను భక్తితో నమస్కరిస్తాను. శ్రీధర్మపురివాసివైన ఓ నరసింహా! నీవు పాప నిర్మూలము చేసే సర్వాభరణ భూషితుడవు.

సీ॥ ఐశ్వర్యమునకు ని-న్ననుసరింపగలేదు
ద్రవ్య మిమ్మని వెంట -దగులలేదు
కనక మిమ్మని చాల-కష్టపెట్టగలేదు
పరుస మిమ్మని నోట -బలకలేదు
సొమ్ము లిమ్మని నిన్ను - నమ్మి కొల్వగలేదు
భూములిమ్మని పేరు - బొగడలేదు
బలము నిమ్మని నిన్ను - బ్రతిమాలగాలేదు
పసుల నిమ్మని పట్టు - పట్టలేదు

తే ॥ నేను కోరిన దొక్కటే - నీలవర్ణ
చయ్యనను మోక్షమిచ్చిన - జాలు నాకు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నేను నిన్ను ఐశ్వర్య మిమ్మని నీవెంట బడలేదు. చాలా ధనమునిమ్మని నీవెంట తగులలేదు. బంగారమునిమ్మని నిన్ను కష్టపెట్టలేదు. పరుసవేది విద్య కావాలని అనలేదు. నిన్ను నమ్మి కొలిచింది నాకు నగలు కావాలని కాదు. నాకు భూములు కావాలని నిన్ను పొగడలేదు. నాకు బలగం కావాలని నిన్ను బ్రతిమాలుకోలేదు. నాకు అశ్వములు, గోవులు వంటి పశువులు కావాలని ఎన్నడూ పట్టుబట్టి యెఱుగను.

ఓ నీలవర్ణా! నేను నిన్ను కోరేదొక్కటే. నాకు శీఘ్రముగా మోక్షము నిమ్ము. అది చాలును నాకు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపు నిలయా, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాప సంహారివి తండ్రీ!



సీ॥ మందుడనని నన్ను - నింద జేసిననేమి?
నా దీనతను జూచి - నవ్వ నేమి?
దూరభారములేక - తూలనాడిన నేమి?
ప్రీతి సేయక వంక - బెట్ట నేమి?
కక్కసంబులు పల్కి - వెక్కిరించిన నేమి?
తీవ్రకోపముచేత - దిట్టనేమి?
హెచ్చు మాటల చేత - నెమ్మెలాడిన నేమి?
చేరి దాపట గేలి - చేయనేమి?

తే ॥ కల్పవృక్షంబువలె నీవు - గల్గ నింక
బ్రజల లక్ష్యంబు నాకేల? - పద్మనాభ
భూషణవికాస! శ్రీధర్మ- పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నన్ను మూర్ఖుడు అని నిందించి ప్రయోజనమేమిటి? నా దీనస్థితి చూచి నవ్విన లాభమేమిటి? నీకు నాకు మధ్య గల దూరాన్ని చూచి తూలనాడి మాటలంటే ఫలమేమిటి? నిష్ఠూరంగా మాట్లాడి నిందించి వెక్కిరించిన ఫలమేమిటి? తీవ్రమైన కోపంతో తిట్టిన ఉపయోగమున్నదా? పెద్ద పెద్ద మారులతో యెత్తి పొడిచిన ప్రయోజనమేమిటి? ఆరు బయట గేలిచేసి పొందేదేమున్నది?

నీవు కల్పవృక్షమువలె మాకు లభించిన తరువాత నాతోటి నరుల లక్ష్యం నాకెందుకయ్యా పద్మనాభా? నీవు వుంటే చాలు నాకు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా! నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాప సంహారివి తండ్రీ!

సీ॥ చిత్తశుద్ధగ నీకు - సేవజేసెద గాని
పుడమిలో జనుల మె-ప్పులకు గాదు
జన్మపావనతకై - స్మరణజేసెద గాని
సరివారిలో బ్రతి-ష్ఠలకు గాదు
ముక్తికోసము నేను - మ్రొక్కి వేడెదగాని
దండి భాగ్యము నిమి-త్తంబు గాదు
నిన్ను బొగడను విద్య - నేర్చితినేకాని
కుక్షినిండెడు కూటి -కొఱకు గాదు

తే ॥ పారమార్థికమునకు నే బాటుపడితి
గీర్తికి నపేక్షపడలేదు - కృష్ణవర్ణ!
భూషణవికాస! శ్రీధర్మ-పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నేను నా మనస్సుద్ధికై నీకు సేవ చేసెదను కాని, ఈ లోకంలోని జనుల మన్నన కోసం కాదు. నా జన్మ పాపవిముక్తికై నిన్ను స్మరిస్తున్నాను కాని, నాతోటివారిలో పేరుప్రతిష్టలకు కాదయ్యా! నేను ముక్తికోసం నీకు మొక్కుతున్నాను కానీ, సమృద్ధిగా భోగ భాగ్యములకోసము కాదు. నేను నేర్చిన విద్యను నిన్ను కీర్తించుటకు ఉపయోగిస్తాను కానీ పొట్టనింపుకొనే కూటికోసం కాదు.

పరమార్థన ప్రాప్తికి పాటుపడుతున్నానయ్యా! నీలమేఘశ్యామా! కీర్తిమీద నాకు ఆపేక్ష లేదయ్యా! నగలతో కాంతులు విరజిమ్మే ఓ ధర్మపురి నివాసా! నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపవిముక్తి చేసే పాప సంహారి.



సీ॥ శ్రవణ రంధ్రముల నీ- సత్కథల్ పొగడంగ
లేశ మానందంబు- లేనివాడు
పుణ్యవంతులు నిన్ను - బూజసేయగ జూచి
భావమందుత్సాహ - పడనివాడు
భక్తవర్యులు నీ ప్ర-భావముల్ పొగడంగ
దత్పరత్వములేక - తలగువాడు
తనచిత్తమందు నీ -ధ్యాన మెన్నడు లేక
కాలమంతయు వృథా - గడపువాడు

తే ॥ వసుధలోపల వ్యర్థుండు - వాడె యగును
మఱియు జెడుగాక యెప్పుడు -మమతనొంది
భూషణవికాస! శ్రీధర్మ-పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర

**భావదీపిక :**

స్వామీ! తన శ్రవణరంధ్రముల ద్వారా నీ మంచి కథలు వినవలెనను ఆసక్తి కొంచెము కూడా లేనివాడు, పుణ్యాత్ములు నిన్ను పూజిస్తుండంగా చూచి తన భావనలో నైనా ఉత్సాహపడనివాడు నీభక్తశిఖామణులు నీ ప్రభావములను వినిపిస్తుంటే తన్మయత్వం పొందక నిరాశక్తి చూపేవాడు, తన మనస్సులో యెప్పుడూ నీ ధ్యానమునెన్నడూ చేయక కాలమంతా వృథా చేసికొనినవాడు.

ఈ భూమిపై అందరికంటే వ్యర్థుడు. మఱివాడు చెడిపోక ఏమవుతాడు? నామీద మమకారం చూపవయ్యా! నగలతో కాంతులు విరజిమ్మే ఓ ధర్మపురి నిలయా! నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపసంహారివి, తండ్రీ!

సీ॥ గౌతమీస్నానాన - గడతేఱద మటన్న
మొనసి చన్నీళ్లలో -మునుగలేను
తీర్థయాత్రలచే గృ-తార్థుడౌదమటన్న
బడలి నేమంబులే- నడపలేను
దానధర్మముల స-ద్గతిని జెందుదమన్న
ఘనముగా నాయొద్ద - ధనములేదు
తపమాచరించి సా-ర్థకము నొందుదమన్న
నిమిషమైన మనస్సు - నిలుపలేను

తే ॥ కష్టములకోర్వ నాచేత - గాదు నిన్ను
స్మరణచేసెద నాయథా- శక్తి కొలది
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! గోదావరి నదిలో స్నానాలు చేసి ముక్తి పొందాలనుకుంటే అంత చన్నీళ్లలో మునగలేను. పోనీ తీర్థయాత్రలు చేసి కృతార్థుడనౌదునా అంటే వాటిలో ఆచరించవలసిన నియమ నిష్ఠలు నేను చేయలేను.

పోనీ, దానధర్మాలు చేసి తరించాలనుకొంటే నావద్ద అంత ధనములేదు. పోనీ, తపము చేసి సార్థకత సంపాదిద్దామనుకొంటే నా మనస్సును ఒక నిమిషం కూడా నిలకడతో వుంచలేను.

కష్టములను భరించటం నావల్ల కాదు. కానీ నాకు సాధ్యమైనంతవరకు నీ స్మరణ చేసెద ప్రభూ! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీ ధర్మపురి నిలయా! నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపసంహారివి తండ్రీ!



సీ॥ అర్థివాంఛకు నీకు - హాని జేయుట కంటె
దెంపుతో వసనాభి - దినుట మేలు
ఆడుబిడ్డలసొమ్ము - లపహరించుట కంటె
బండ గట్టుక నూత - బడుట మేలు
పరులకాంతల బట్టి - బల్మిగూడుట కంటె
బడబాగ్ని కీలల - బడుట మేలు
బ్రతుకజాలక దొంగ - పనులు చేయుట కంటె
గొంగుతో ముష్టెత్తు - కొనుట మేలు

తే ॥ జలజదళనేత్ర నీ భక్త - జనులతోడి
జగడమాడెడు పనికంటె - జావు మేలు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నిన్ను యాచించేవారికి, నీకు హాని చేయుటకంటే ధైర్యం చేసి విషమును మింగటం మంచిపని. ఆడపిల్లల సొమ్ములు అపహరించుట కంటే ఒక రాతిబండను నడుముకు కట్టుకొని బావిలో దూకుట మంచిది. పరస్త్రీల మానములపహరించి ఆనందించుటకంటె బడబాగ్ని జ్వాలలో కాలిపోవటం మంచిది. బ్రతుకుట కోసం దొంగతనం చేస్తూ జీవించుటకంటే జోలెతో ముష్టెత్తుకోవటం మంచిది.

ఓ పద్మనయనా! నీ భక్తులతో పోట్లాడుట కంటే చనిపోవటం మంచిది. నగల కాంతులు విరజిమ్మే ఓ ధర్మపురి నిలయా! ఓ దుష్టాంతకా! నీవు పాప సంహారివి.

సీ॥ గార్ధభంబున కేల - కస్తూరి తిలకంబు?
మర్కటంబున కేల-మలయజంబు?
శార్ధూలమున కల -శర్కరాపూపంబు?
సూకరంబున కేల - చూతఫలము?
మార్జాలమున కేల - మల్లెపువ్వులబంతి?
గుడ్లగూబల కేల - కుండలములు?
మహిషంబుకే నిర్మలమైన వస్త్రముల్?
బక సంతతికి నేల - పంజరంబు?

తే ॥ ద్రోహచింతన జేసెడి - దుర్జనులకు
మధురమైనట్టి నీనామ-మంత్రమేల?
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! గాడిదకు కస్తూరీ తిలకం పెట్టి ప్రయోజనం ఏమిటి? కోతికి చందనము పూసిన లాభమేమి? పెద్దపులి చక్కెరతో చేసిన అరిసెలు తింటుందా? పందికి మామిడిపండు యెందుకు? గుడ్లగూబకు కుండలము లెందుకు? దున్నపోతుకు నూతన వస్త్రములెందుకు? కొంగలకు యెవ్వరైనా పంజరములు చేయిస్తారా?

ద్రోహము చేయాలనుకొనే దుర్మార్గులకు మధురమైన నీనామమంత్రము యెందుకు నగలతో కాంతులు విరజిమ్మే ఓ ధర్మపురి నివాసా! నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాప సంహారివి తండ్రీ!



సీ॥ పసరంబు పందైన - బసులకాపరి తప్పు
ప్రజలు దుర్జనులైన - ప్రభుని తప్పు
భార్య గయ్యాళైన - ప్రాణనాధుని తప్పు
తనయుండు దుష్టైన - తండ్రి తప్పు
సైన్యంబు చెదిరిన - సైన్యనాధుని తప్పు
కూతురు చెడుగైన - మాత తప్పు
అశ్వంబు చెడుగైన - నారోహకుని తప్పు
దంతి దుష్టయిన మా- వంతు తప్పు

తే ॥ ఇట్టి తప్పులెఱుంగక - యిచ్చవచ్చి
నటుల మెలగుదు రిప్పుడీ- యవని జనులు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరసింహ-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! పశువు బందెల దొడ్డిలో బడితే అది కాపరి తప్పు. ప్రజలు దుర్జనులైతే అది పాలకుని తప్పు. భార్య గయ్యాళిగా మారితే అది ఆవిడ భర్త తప్పు. కొడుకు దుష్టుడైతే అది వాడి తండ్రి చేసిన తప్పు. సైన్యము పారిపోతే అది సైన్యాధిపతి తప్పు. కూతురు చెడిపోతే అది తల్లి చేసిన తప్పవుతుంది. గుఱ్ఱము అడ్డదారులు తొక్కితే అది రౌతు తప్పు. ఏనుగు చెప్పిన మాటలు వినకపోతే అది మావటి తప్పు.

ఈ విధమైన తప్పులు చేస్తూ ఈ నరులు చెడిపోతున్నారు ప్రభూ! అనేక నగలతో కాంతులు విరజిమ్మే ఓ ధర్మపురి నివాసా, నారసింహా, ఓ దుష్టాంతకా! నీవు పాపసంహారివవి తండ్రీ!

సీ॥ కోతికి జలతారు – కుల్లాయి యేటికి?
విరజాజి పూదండ– విధవ కేల?
ముక్కిడి తొత్తుకు – ముత్తెంపు నత్తేల?
నద్ద మేమిటికి జా–త్యంధునకును?
మాచకమ్మకు నేల–మౌక్తిక హారముల్?
క్రూరచిత్తునకు స–ద్గోష్ఠులేల?
ఱంకుబోతుకు నేల –బింకంపు నిష్ఠలు
వాని యేటికి దుష్ట–వర్తనునకు?

తే ॥ మాట నిలుకడ సుంకరి – మోటు కేల?
చెవిటివానికి సత్కథా– శ్రవణమేల?
భూషణ వికాస! శ్రీధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! కోతికి పట్టు లాల్చి తొడిగి లాభమే లేదు. దానిని క్షణంలో మురికి చేస్తుంది. వైధవ్యం పొందిన స్త్రీకి విరజాజుల దండ దేనికి? చట్టిముక్కు పని మనిషికి ముత్యపు ముక్కుపుడక యెందుకు? పుట్టు గుడ్డువారికి అద్దముతో ఏమిపని? స్త్రీత్వం లేని మాచకమ్మకు ముత్యాల హారాలు దేనికి? క్రూరునికి సజ్జనులతో గోష్ఠియెందుకు? ఱంకు బుద్ధిగల జులాయికి నిష్ఠ నియమాలెందుకు?దుష్టునికి వావి వరుసలుంటాయా?

పన్ను కట్టించుకునే మొఱటు వానికి మాట నిలకడ ఉంటుందా? చెవిటి వానికి భాగవత కథ వినిపించి ప్రయోజనమేమిటి? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరము చేయు తండ్రివి.



సీ॥ మాన్యంబులీయ స–మర్థుడొక్కడు లేడు
మాన్యములే జెఱుప స–మర్థులంత
యెండినయూళ్లగో–డెఱిగింప దెవ్వడు
బండిన యూళ్లకు – బ్రభువు లంత
యితడు పేద యటంచు – నెఱిగింప దెవ్వడు
కలవారి సిరులెన్న–గలరు చాల
దనయాలి చేష్టల – తప్పెన్న దెవ్వడు
పెరకాంత ఱంకెన్న – బెద్ద లంత

తే ॥ యిట్టి దుష్టుల కధికార–మిచ్చినట్టి
ప్రభువు తప్పు లటంచును – బలుకవలెను
భూషణ వికాస! శ్రీధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! మాకు మాన్యములు ఈయగల సమర్ధుడు ఒక్కడూ లేడు. అందరూ నాకున్న మాన్యములను కొల్లగొట్టేవారే. అధికారులకు ఎండిపోయిన వూళ్లగోడు ఒక్కడూ చెప్పడు. పండిన వూళ్లకు మాత్రం అందరూ ప్రభువులే. కలవారి సంపదల గురించి పొగిడే ఈ అధికారులలో ఒక్కడూ పేదవాడి గురించి పట్టించుకోడు. తన భార్య చేష్టలతో తప్పులు తెలుసుకోలేని వాళ్ళంతా పరస్త్రీల ఱంకులెంచటం వాళ్లందరికి బాగుగా తెలియును.

ఇటువంటి దురాత్ములకు అధికారం ఇచ్చిన ప్రభువును తప్పులెంచవలెను అంతే. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరము చేయు తండ్రివి.

సీ॥ తల్లిగర్భమునుండి- ధనము తే దెవ్వడు
వెళ్లిపోయినవాడు - వెంటరాడు
లక్షాధికారైన - లవణ మన్నమె కాని
మెఱుగు బంగారంబు - మ్రింగబోడు
విత్త మార్జనజేసి - విఱ్ఱవీగుటె కాని
కూడబెట్టిన సొమ్ము - కడువ బోడు
పొందుగా మఱుగైన - భూమిలోపల బెట్టి
దానధర్మము లేక - దాచి దాచి

తే ॥ తుదకు దొంగల కిత్తురో - దొరల కవు
తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు?
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! తల్లి కడుపులోనుంచి ఎవడూ ధనముతో పుట్టడు. వాడు చచ్చేటప్పుడు వెంట ఏమీ తీసికొని పోజాలడు. గొప్ప లక్షాధికారియైనా ఉప్పు కలిగిన అన్నము తింటాడు కాని, మెఱిసే బంగారాన్ని మింగలేడు. ధనము సంపాదించి మిడిసిపడుటే కాని, కూడబెట్టిన ముల్లె అనుభవించలేడు. దొంగల భయంతో భూమిలో పాతరబెట్టి దాన ధర్మాలు చేయక తనువు చాలిస్తాడు. అది చివరకు పరుల పాలవుతుంది.

ఓ లక్ష్మీపతీ! తేనెటీగలు మకరందాన్ని దాచి దాచి చివరకు పరుల పాలు చేయవా? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరము చేయు తండ్రివి.



సీ॥ లోకమందెవడైన - లోభిమానవుడున్న
భిక్ష మర్థికి జేత - బెట్టలేడు
తాను బెట్టక యున్న - తగవు పుట్టదు గాని
యొరులు పెట్టగ జూచి - యోర్వ లేదు
దాతదగ్గఱ జేరి - తన ముల్లెచనినట్లు
జిహ్వతో జాడీలు - చెప్పుచుండు
ఫలము విఘ్నంబైన - బలు సంతసము నొందు
మేలు కల్గిన జాల - మిడుకు చుండు

తే ॥ శ్రీరమానాథ! యిటువంటి - క్రూరునకును
భిక్షుకుల శత్రువని - పేరు బెట్టవచ్చు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! లోకంలో ఎవడైనా లోభి అయితే భిక్షమడిగే వానికి చేతిలో ఏమీ పెట్టలేడు. తాను పెట్టక పోతే ఏ గొడవా లేదు కాని, ఇంకొకరు పెడితే ఓర్వలేడు. ఆ దాత దగ్గర చేరి తన సొమ్ము పోయినట్లు నాలుక పీక్కుపోయేలా చాడీలు చెబుతూ వుంటాడు. ఇతరుల పనులకు విఘ్నము కలిగితే సంతోషించేవారు, తమకు కొంచెం మేలు కలిగితే మిడిసి పడుతూ వుంటారు.

ఓ లక్ష్మీపతీ! ఇటువంటి క్రూరులను 'అడుక్కుని తినేవాడి వద్ద గీక్కుని తినేవాడు' అని పిలువ వచ్చును. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరము చేయు తండ్రివి.

సీ॥ తనువులో బ్రాణముల్ - తరలిపోయెదు వేళ
నీ స్వరూపమును ధ్యా-నించునతడు
నిమిషమాత్రములోన - నిన్ను జేరును గాని
యముని చేతికి జిక్కి - శ్రమలబడడు
పరమసంతోషాన - భజన జేసెడివాని
పుణ్యమేమనవచ్చు - భోగిశయన
మోక్షము నీ దాస-ముఖ్యుల కగు గాని
నరక మెక్కడిదయ్య - నళినసేత్ర

తే ॥ కమలనాభ నీ మహిమలు - గానలేని
తుచ్ఛులకు ముక్తి దొరకుట - దుర్లభంబు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! శరీరంలోనుంచి ప్రాణములు వీడి పోయేవేళ నీ స్వరూపమును స్మరించేవాడు, నిమిషంలో నిన్ను చేరుకుంటాడు. అతడు యముడు చేతికి చిక్కడు. ఓ శేష సాయీ! అటువంటి భక్తుని పుణ్యం ఏమని వర్ణించగలము? నీ దాసులలో ముఖ్యులైన వారికి మోక్షము దక్కుతుంది. కానీ, ఓ పద్మనయనా! వారికి నరకమెందుకు వస్తుంది?

ఓ కమలనాభా! నీ మహిమలు తెలియలేని దుష్టులకు ముక్తి దొరుకుట అసాధ్యము. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరము చేయు తండ్రివి.



సీ॥ నీలమేఘశ్యామ! - నీవే తండ్రివి మాకు
కమలవాసిని మమ్ము - గన్నతల్లి
నీ భక్తవరులంత - నిజమైన బాంధవుల్
నీ కటాక్షము మా క-నేకధనము
నీ కీర్తనలు మాకు - లోక ప్రపంచంబు
నీ సహాయము మాకు - నిత్యసుఖము
నీ మంత్రమే మాకు - నిష్కళంకపు విద్య
నీ పద ధ్యానంబు - నిత్యజపము

తే ॥ తోయజాతాక్ష నీ పాద - తులసిదళము
రోగముల కౌషధము బ్రహ్మ - రుద్రవినుత
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ నీలమేఘవర్ణా! నీవే మాకు తండ్రివి. కమలవాసినియైన శ్రీలక్ష్మి మాకు తల్లి. నీ భక్తులందరు మాకు ఆప్తబంధువులు. నీ దయయే మాకు సాటిలేని సంపద. నీ కీర్తనలే మాకు లోకము, ప్రపంచము. నీ సహాయమే మాకు నిత్యము సుఖమునిస్తుంది. నీ మంత్రమే కళంక రహితమైన విద్య మాకు. నీ పాద ధ్యానమే మాకు నిత్యమూ చేయు జపము.

ఓ పద్మదళ నేత్రా! నీపాదములందుంచిన తులసిదళము ఓబ్రహ్మ రుద్ర సన్నుతా, మా సమస్త రోగములకు దివ్యౌషధము.నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరము చేయు తండ్రివి.

సీ॥ బ్రతికినన్నాళ్లు నీ- భజన తప్పను గాని
మరణకాలమునందు-మఱతునేమొ
యావేళ యమదూత - లాగ్రహంబున వచ్చి
ప్రాణముల్ పెకలించి - పట్టునపుడు
కఫ వాత పైత్యముల్ - గప్పగా భ్రమచేత
గంప ముద్భవమంది - కష్టపడుచు
నా జిహ్వతో నిన్ను - నారాయణా యంచు
బిలుతునో శ్రమచేత - బిలువలెనో

తే ॥ నాటికిప్పుడె చేసెద - నామభజన
తలచెదను, జెవి వినవయ్య!- ధైర్యముగను
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! బ్రతికినంతకాలమూ నేను నీ భజన మఱువను. కాని, మఱణించేటప్పుడు నిన్ను మఱచెదనేమో అని నా భయము. ఆ సమయంలో యమభటులు ఆగ్రహంతో నా ప్రాణాలు పెరికివేస్తుంటే కఫము, వాతము, పైత్యము కప్పుతాయి. భ్రమకలిగి శరీరం కంపిస్తుంటుంది. ఎంతో కష్టపడుతుంటాను. అప్పుడు నాలుకతో నిన్ను నారాయణా అని నిన్ను పిలువగలనో లేదో శ్రమచెంది పిలువలేనో.

నాటి వరకు ఆగుట దేనికి? నేడే నీనామభజన చేస్తాను. నీచెవులారా వినవయ్యా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురివాసా!, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరము చేయు తండ్రివి.



సీ॥ పాంచభౌతికము దు-ర్భరమైన కాయంబి
దెప్పుడో విడుచుట - యెఱుక లేదు
శతవర్షములదాక - మితము జెప్పిరి గాని
నమ్మరా దామాట - నెమ్మనమున
బాల్యమందో మంచి- ప్రాయమందో లేక
ముదిమియందో లేక- ముసలియందో
యూరనో యడవినో - యుదకమధ్యముననో
యెప్పుడో విడుచుట-యేక్షణంబొ

తే ॥ మరణమే నిశ్చయము బుద్ధి-మంతుడైన
దేహమున్నంతలో మిమ్ము-దెలియవలయు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఇది నీరు, గాలి, మట్టి, అగ్ని, ఆకాశము(శూన్యము) నంటిన శరీరం. దుర్భరమైనది. దీనినెప్పుడు విడచెదనో యెఱుగను. ఏదో దీనికి నూరేళ్ల పరిమితిపై పెట్టారు గాని మనస్సులలో కూడా ఆ మాటను నమ్మలేము. ఈ శరీరాన్ని బాల్యంలోనో, యవ్వనంలోనో, కౌమారంలోనో, వృద్ధాప్యంలోనో వదలివేస్తాను. ఇంట్లోనో, వీధిలోనో, అడవిలోనో, నీటిలోనో మరెక్కడో ఈ శరీరాన్ని వున్నట్లుగా విడచివేస్తాను. ఏ క్షణాననైనా కావచ్చును.

మరణం నిశ్చయమని తెలిసిన బుద్ధిమంతుడు దేహమున్నప్పుడే ఈ విషయం తెలుసుకోవాలి, స్వామీ! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురివాసా!, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరము చేయు తండ్రివి.

సీ॥ తల్లిదండ్రులు భార్య- తనయు లాప్తులు బావ
మఱది లన్నలు మేన- మామగారు
ఘనముగా బంధువుల్ - గల్గినప్పటికైన
దాను దర్లగ వెంట - దగిలి రారు
యముని దూతలు ప్రాణ -మపహరించుక పోగ
మమతతో బోరాడి - మాన్పలేరు
బలగ మందఱు దుఃఖ
నరక మెక్కడిదయ్య - నళిననేత్ర

తే ॥ కమలనాభ నీ మహిమలు - గానలేని
తుచ్ఛులకు ముక్తి దొరకుట - దుర్లభంబు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! శరీరంలోనుంచి ప్రాణములు వీడి పోయేవేళ నీ స్వరూపమును స్మరించేవాడు, నిమిషంలో నిన్ను చేరుకుంటాడు. అతడు యముడు చేతికి చిక్కడు. ఓ శేష సాయీ! అటువంటి భక్తుని పుణ్యం ఏమని వర్ణించగలము? నీ దాసులలో ముఖ్యులైన వారికి మోక్షము దక్కుతుంది. కానీ, ఓ పద్మనయనా! వారికి నరకమెందుకు వస్తుంది?

ఓ కమలనాభా! నీ మహిమలు తెలియలేని దుష్టులకు ముక్తి దొరుకుట అసాధ్యము. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరము చేయు తండ్రివి.



సీ॥ ఇభరాజవరద!ని - న్నెంత బిల్చినగాని
మాఱు పల్క వదేమి- మౌనితనమొ?
మునిజంనార్చిత! నిన్ను- మ్రొక్కి వేడినగాని
కనుల జూడ వదేమి - గబసుదనమొ?
చాల దైన్యమునొంది - చాటు చొచ్చినగాని
భాగ్య మియ్య వదేమి- ప్రౌఢతనమొ?
స్థిరముగా నీపాద- సేవ జేసేద నన్న
దొరకజాల వదేమి- ధూరతనమొ?

తే ॥ మోక్షదాయక! యిటువంటి- మూర్ఖజనుని
కష్టపెట్టిన నీకేమి - కడుపునిండు.
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ గజేంద్రవరదా! నిన్నెంతపిలిచినా తిరిగి పలుకరించవేమయ్యా? మౌనవ్రతము పట్టితివా యేమి? మునిజనసమూహములు చేత అర్చించబడుదేవా! నిన్నెంత మ్రొక్కినా, వేడుకొనినా కనులతో చూడవు యేమి నీగడుసుదనము? చాలా దీనత్వముతో నీమఱుగు జొచ్చితినయ్యా! కాని నీ దర్శన భాగ్యం ఇయ్యవు. ఏమీనీ నైపుణ్యం!! నేను స్థిరముగా నీపాదసేవ చేసుకొంటాను అంటే దొరకవు. ఏమినీ మోసము?

ఓ మోక్షదాతా! నావంటి మూర్ఖుని కష్టపెడితే నీకేమి లాభమయ్యా? నీవే ఆలోచించు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ నీమీద కీర్తనల్ - నిత్యగానము జేసి
రమ్యమొందింప నా -రదుండగాను
సావధానముగ నీ-చరణ పంకజ సేవ
సలిపి మెప్పింపగ- శబరిగాను
బాల్యమప్పటినుండి - భక్తి నీయందున
గలుగను బ్రహ్లాద - ఘనుడగాను
ఘనముగా నీమీది -గ్రంథముల్ గల్పించి
వినుతిసేయను వ్యాస - మునినిగాను

తే ॥ సాధుడను మూర్ఖమతి మను -ష్యాధముడను
హీనుడను జుమ్మి నీవు - నన్నేలుకొనుము
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నిత్యమూ నీమీద కీర్తనలు గానం చేసి నీ మెప్పు పొందుదామంటే నేను నారదముని కాదు. తీరికగా నీపాదపద్మాలనే స్మరిస్తూ ఏనాటికైనా నీమెప్పు పొందగలనంటటే నేను శబరిని కాదు. బాల్యంనుంచే నీమీద అచంచలమైన భక్తి కలిగి నీ కృప పొందుటకు నేను ప్రహ్లాదుడనుగాను. నీమీద ఘనమైన గ్రంథములను రచించి నీ వినుతి చేతునా అంటే వ్యాసమునిని కాదు.

నేను సాధారణమైన మూర్ఖుడను, మానవాధముడను, హీనుడను సుమా! నీవే నన్నేలుకోవాలి. నీదే నా భారము. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ అతిశయంబుగ గల్ల-లాడనేర్చితిగాని
పాటిగా సత్యముల్ - పలుకనేర
సత్కార్య విఘ్నముల్ - సలుప నేర్చితిగాని
యిష్టమొందగనిర్వ -హింపనేర
నౌకరి సొమ్ముకు దోసి-లొగ్గనేర్చితిగాని
చెలువుగా ధర్మంబు -సేయనేర
ధనము లియ్యంగ వ-ద్దనగ నేర్చితిగాని
శీఘ్ర మిచ్చెదునట్లు-చెప్పనేర

తే ॥ బంకజాతాక్ష! నే నతి-పాతకుడను
దప్పులన్నియు క్షమియింప-దండ్రి వీవె!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ఆభిజాత్యము జూపి అబద్ధములాడుట నేర్చితిని గాని, నియమంతో సత్యమును పలుకనేరను. ఏ సత్కార్యానికైనను విఘ్నములు కలిగిస్తాను కాని, ఇష్టముతో ఒక సత్కార్యము చేయనేరను. పరుల సొమ్ముకు చేయిజాచెద గాని, స్నేహముతో ధర్మము మాత్రం చేయనేరను. ఎవరైన ధనమితరులకిస్తుంటే వద్దు అని అంటాను కాని, శీఘ్రముగా ఈయమని ప్రోత్సహించను.

ఓ కమలనయనా! నేను పాపిని ప్రభూ! నా తప్పులన్నింటిని క్షమించే తండ్రివి నీవే. దగద్ధగాయముగా నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ ఉర్విలో నాయుష్య - మున్న పర్యంతంబు
మాయ సంసారంబు - మరగి నరుడు
సకల పాపములైన - సంగ్రహించును గాని
నిన్ను జేరెడి యుక్తి - నేర్వలేడు
తుదకు గాలునియొద్ద - దూతలిద్దఱు వచ్చి
గుంజుక చని వారు - గ్రుద్దుచుండ
హింస కోర్వగ లేక - యేడ్చి గంతులువేసి
దిక్కులేదని నాల్గు - దిశలు చూడ

తే ॥ దన్ను విడిపింప వచ్చెడి - ధన్యుడేడి
ముందు నీదాసుడై యున్న - ముక్తి గలుగు
**భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!**
**దుష్టసంహార! నరహరి-దురితదూర!**

**భావదీపిక :**

స్వామీ! ఈ భూమిమీద మానవులు ఆయువు వున్నంతకాలము మాయతో కూడిన సంసార వ్యామోహంలో మునిగియుంటారు. సమస్త పాపములను సలుపుతూనే వుంటాడు, కాని నిన్ను చేరుకొనే ఉపాయమును ఆలోచించడు. చివరికి యముని దూత లిద్దరు వచ్చి వాడి జీవుని లాగికొనిపోతుంటే, రానని గింజుకొంటున్న వాని, వారు గుద్దుతుంటే, ఆ హింస భరించలేక ఏడ్చి గంతులు పెడతాడు. ఎవడూ దిక్కులేదని దిక్కులు చూస్తుంటాడు.

అప్పుడు వాడిని విడిపించే రక్షకుడెవ్వడు? అందుకని బ్రతికివున్నప్పుడే నీదాసుడై, నీ శరణుపొందితే ఈ తిప్పలుండవు కదా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ అధిక విద్యావంతు-లప్రయోజకులైరి
పూర్ణశుంఠలు సభా-పూజ్యులైరి
సత్యవంతులమాట-జన విరోధంబాయె
వదరుబోతులమాట-వాసికెక్కె
ధర్మవాదపరుల్-దారిద్ర్యమొందిరి
పరమలోభులు ధన-ప్రాప్తులైరి
పుణ్యవంతులు రోగ-భూత పీడితులైరి
దుష్టమానవులు వ-ర్ధిష్ణులైరి

తే ॥ పక్షివాహన! మావంటి -భిక్షుకులకు
శక్తిలేదాయె నిక నీవె-చాటు మాకు
**భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!**
**దుష్టసంహార! నరహరి-దురితదూర!**

**భావదీపిక :**

స్వామీ! ఏమికాలం వచ్చిందయ్యా? చూడు. ఎక్కువ విద్యనేర్చినవారు అప్రయోజకులయ్యారు. నిండా దద్దమ్మలు పరమపూజ్యులైనారు. సత్యసంధులమాట జనులకు నచ్చుటలేదు. నోటికి వచ్చింది మాట్లాడే వారి మాటలు ప్రసిద్ధిచెందినవి.

ధర్మవాదన చేసేవారు దరిద్రులయ్యారు. పరమ లోభులు ధనవంతులయ్యారు. పుణ్యము చేసిన వారు రోగ పీడితులైపోయారు. దుష్టులు ఉపదేశించేవారయ్యారు.

ఓ గరుడ గమనా! మావంటి భిక్షకులకు శక్తిలేదయ్యా! నీవే నీ చాటుకు నన్ను చేర్చుకోవాలి. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ భుజబలంబున బెద్ద - పులుల జంపగవచ్చు
పాముకంఠము జేత - బట్టవచ్చు
బ్రహ్మ రాక్షసకోట్ల - బాఱద్రోలగవచ్చు
మనుజుల రోగముల్- మాన్పవచ్చు
జిహ్వ కిష్టముగాని - చేదు మ్రింగగవచ్చు
బదను ఖడ్గము చేత -నదమవచ్చు
గష్టమొందుచు ముండ్ల-కంపలో జొరవచ్చు
దిట్టుబోతుల నోళ్ళు- కట్టవచ్చు

తే ॥ బుడమిలో దుష్టులకు జ్ఞాన-బోధ తెలిపి
సజ్జనుల జేయలేడెంత -చతురుడైన
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! గొప్ప భుజబలంతో పెద్దపులినైన చేతులతో చంపవచ్చును. విష సర్పమునైన చేతితో కంఠాన్ని పట్టుకొనవచ్చును. కోటిమంది బ్రహ్మ రాక్షసులనైన పారద్రోలవచ్చును. మానవులకు వచ్చు రోగములన్నింటిని మాన్పవచ్చును. నాలుకపై పెట్టలేని చేదునైన మ్రింగవచ్చును. పదునైన ఖడ్గాన్ని చేతితో అది వేయవచ్చును. కష్టపడుతూ ముండ్లకంపలో దూరవచ్చును. తిట్టిపోసే వారి నోళ్ళు మూయించవచ్చును.

కానీ ఈ లోకంలో ఎంత చతురుడైనా దుష్టులకు జ్ఞానబోధ చేయలేడు. వారిని సజ్జనులను చేయలేడయ్యా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ అవనిలోగల యాత్ర- లన్ని చేయగవచ్చు
ముఖ్యుడై నదులందు - మునగవచ్చు
ముక్కుపట్టుక సంధ్య-మొనసి వార్చగవచ్చు
దిన్నగా జపమాల-ద్రిప్పవచ్చు
వేదాల కర్థంబు-వితిచి చెప్పగవచ్చు
శ్రేష్ఠ క్రతువు లెల్ల-జేయవచ్చు
ధనము లక్షలు కోట్లు- దానమియ్యగవచ్చు
నైష్ఠికాచారముల్ - నడుపవచ్చు

తే ॥ జిత్త మన్యస్థలంబున- జేరకుండ
నీ పదాంభోజములయందు - నిలపరాదు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! పట్టుదల వుంటే భూమిమీద వున్న క్షేత్రాలన్నీ సందర్శించవచ్చును. పుణ్యం కోసం నదులన్నింటిలో మునిగి స్నానం చేయవచ్చును. అక్కడే ముక్కు మూసుకొని సంధ్య వార్చవచ్చును. జపము చేస్తూ జపమాల త్రిప్పవచ్చును. దములన్నింటిని విపులంగా వివరించవచ్చును. శ్రేష్టమైన యాగములను చేయవచ్చును. ధనము లక్షలు, కోట్లు అని లెక్కసేయక దానాలు చేయవచ్చును. గొప్ప నిష్ఠతో ఆచారములను పాటించవచ్చును.

మనస్సు పరిపరి విధముల పోక నిలిపి నీ పాదపద్మములను ధ్యానించలేకున్నాను. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరసింహా! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ కర్ణయుగ్మమున నీ-కథలు సోకిన జాలు
పెద్దపోగుల జోళ్లు- పెట్టినట్లు
చేతులెత్తుచు బూజ-సేయగల్గినజాలు
తోరంపు కడియాలు-దొడిగినట్లు
మొనసి మస్తకముతో -మ్రొక్క గల్గినజాలు
చెలువమైన తురాయి-చెక్కినట్లు
గళము నొవ్వగ నిన్ను-బలుక గల్గినజాలు
వింతగా గంఠీలు-వేసినట్లు

తే ॥ పూని నిను గొల్చుటే సర్వ-భూషణంబు
లితర భూషణముల నిచ్చ-గింపనేల
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నారెండు చెవులకు నీ దివ్య గాథలు వినిపిస్తే చాలు నాకు పెద్ద చెవిపోగులు ధరించినట్లుంటుంది. నా చేతులెత్తి పూజచేస్తే నారెండు చేతులకు బలిష్టమైన బంగారు కడియాలు ధరించినట్లుంటుంది. నా తలవంచి నీకు మ్రొక్కితే చాలు. నాకు అందమైన తురాయితలపై ధరించినట్లుంటుంది. నాగొంతు నొప్పి పుట్టేట్లు నీనామ సంకీర్తన చేసిన చాలును, అది నాకు మంచి 'కంటె' ధరించినట్లుంటుంది.

నిన్ను పూనికతో కొల్చుటయే నాకు సర్వాభరణములను ధరించుట. ఇక నాకు బంగారు ఆభరణాలతో పనేమున్నది, లేనేలేదు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓ దుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ భువనరక్షక! నిన్ను - బొగడనేరని నోరు
ప్రజకగోచరమైన - పాదుబొంద
సురవరార్చిత! నిన్ను -జూడగోరని కనుల్
జలములోపల నెల్లి- సరపుగుండ్లు
శ్రీరమాధిప! నీకు - సేవజేయని మేను
కూలి కమ్ముదువోని- కొలిమితిత్తి
వేడ్కతో నీకథల్ - వినని కర్ణములైన
గఠినశిలాదుల-గలుగు తొలలు

తే ॥ పద్మలోచన నీమీద- భక్తిలేని
మానవుడు రెండుపాదాల-మహిషమయ్య
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ఓ జగద్రక్షకా! నిన్ను కీర్తించుటచేతగాని నోరుప్రజలకు కనబడని పాడుబడ్డ గొయ్యి. దేవతార్చితా! నిన్ను చూడలేని కండ్లు నీటిలో వుండె నెల్లిసరము యొక్క కాయలు. ఓ లక్ష్మీవల్లభా! నీకు సేవచేయని శరీరం ఎవ్వరూ అద్దెకు తీసికొనని గాలితిత్తి. వేడుకతో నీ కథాశ్రవణము చేయని చెవులు కఠినమైన కొండలలోని తొఱ్ఱలు.

ఓ పద్మనయనా! నీయందు భక్తిలేని నరుడు రెండుకాళ్ల జంతువు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ అతివిద్య నేర్చుట - అన్నవస్త్రములకే
పసుల నార్జించుట- పాలకొఱకె
సతిని బెండ్లాడుట- సంసార సుఖముకే
సుతుల బోషించుట-గతులకొఱకె
సైన్యముల్ గూర్చుట-శత్రుజయమునకే
సాము నేర్చుటలెల్ల- చావుకొఱకె
దానమిచ్చుటయు ముం-దటి సంచితమునకే
ఘనముగా జదువుట-కడుపు కొఱకె

తే ॥ యితర కామంబు గోరక- సతతముగను
భక్తి నీయందు నిలుపుట -ముక్తి కొఱకె
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! గొప్ప విద్యనేర్చుట అన్న వస్త్రములు పొందుటకే, పశువులను పెంచుట పాల కొఱకే కదా! భార్యను పెండ్లాడుట సంసార సుఖము కొఱకె. కొడుకులను పోషించేది ఉత్తర క్రియల ద్వారా సద్గతులు పొందుటకే. ఒక రాజు సైన్యాన్ని ఎందుకొఱకు కూర్చుకొంటాడంటే శత్రువులపై జయము కలుగుటకే. కత్తిసాము నేర్చుట చివరికి తన మరణమునకే. దానము చేయుట దాని వలన ప్రోగుచేసికొనే పుణ్యము కొఱకే కదా! మేలుగా చదువుట కడుపు నింపుకొనుటకే.

ఇక ఇంత పీడ దేనికి? ఏవేవో కోరికలు వుండుట వలననే కదా! వీటన్నిటికి వెంపర్లాడకుండా నీపై భక్తి నిలిపితే ముక్తి కలుగదా? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ ధరణిలో వేయేండ్లు - తనువు నిల్వగబోదు
ధనమెప్పటికి శాశ్వ-తంబు గాదు
దారసుతాదులు -తనవెంట రాలేరు
భృత్యులు మృతిని ద-ప్పింపలేరు
బంధుజాలము తన్ను-బ్రతికించుకోలేరు
బలపరాక్రమ మేమి- పనికిరాదు
ఘనమైన సకల భా-గ్యం బెంత గల్గిన
గోచిమాత్రంబైన -గొనుచుబోదు

తే ॥ వెఱ్ఱి కుక్కల భ్రమలన్ని - విడిచి నిన్ను
భజన జేసెడివారికి - బరమసుఖము
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ఈ భూమిమీద మానవుడు వందయేండ్లు జీవించి ఉండలేడు. ధనము ఎవరిదగ్గరనైనా శాశ్వతంగా వుండదు. మనము చనిపోయేటప్పుడు భార్యగాని, బిడ్డలుగాని వెంటపడి రాలేరు. మన భృత్యులు మన చావును తప్పించలేరు. మన బంధువుల మూక మన బ్రతుకును సమకూర్చలేరు. అక్కడ మన బలపరాక్రమములు పనికిరావు. గొప్ప భాగ్య సంపదలున్నా గోచిమాత్రము కూడా పైన ధరించలేడు.

కాబట్టి ఈ వెఱ్ఱి భ్రలమన్నీ విడచివేసి నిన్ను భజించిన పరమసుఖము కలుగుతుంది. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ నరసింహా! నాకు దుర్గుణములే మెండాయె
సుగుణ మొక్కటిలేదు - చూడ జనిన
నన్యకాంతల మీద - నాశ మానగలేను
వొరుల క్షేమము చూచి - యోర్వలేను
ఇటువంటి దుర్బుద్ధు -లిన్ని నాకున్నవి
నేను జేసెడివన్ని -నీచకృతులు
నావంటి పాపిష్టి - నరుని భూలోకాన
బుట్టజేసితి వేల- భోగిశయన!

తే ॥ అబ్జదళనేత్ర! నాతండ్రి -వైన ఫలము
నేరములు గాచి రక్షింపు- నీవె దిక్కు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ నరహరీ! నాకు దుర్గుణములే మెండుగా వున్నాయి. చూద్దామంటే ఒక్క సుగుణం కూడా లేదు. పరస్త్రీలపై వ్యామోహం పోనే లేదు. ఇతరుల క్షేమమును చూచి ఓర్వలేను. ఇటువంటి దుర్బుద్ధులు నాకెన్నో వున్నవి. నేను చేసే పనులు కూడా చాలా నీచమైనవే. నావంటి పాపిష్ఠి వాడు భూలోకంలో వుండడు. ఓ పన్నగశాయీ! నావంటి వాని నెందుకు పుట్టించావు?

ఓ పద్మదళ నేత్రా! నాతండ్రివైన నీకు తప్పదు. నన్ను రక్షించు. నీవేదిక్కు. నా నేరములెంచకు. కానున్న ఏమిలాభము? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ ధీరత బరుల నిం-దింప నేర్చితి గాని
తిన్నగా నిను బ్రస్తు -తింపనైతి
బొరుగు కామినులందు - బుద్ధి నిల్పితి గాని
నిన్ను సంతతము ధ్యా-నింపనైతి
బెరికిముచ్చట లైన -మురిసి వింటినిగాని
యెంచి నీకథ లాల-కించనైతి
గౌతుకంబున బాత-కము గడించితిగాని
హెచ్చు పుణ్యము సంగ్ర-హింపనైతి

తే ॥ నవనిలో నేను జన్మించి -నందు కేమి
సార్థకము గానరాదాయె -స్వల్పమైన
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! మొండి ధైర్యంతో పరనింద చేస్తాను గాని నిన్ను తిన్నగా కీర్తించుట మాత్రము జేయలేకపోయాను. పరస్త్రీల అందచందాలపై బుద్ధినిలుపగలను కాని, నిరంతరం నిన్ను ధ్యానించాలంటే మనసు నిలువదు. కించపరిచే మాటలు తెగ వింటాను గాని, నేను నిశ్చయించుకొని నీ కథలను విననైతిని. కుతూహలంతో పాపాలు చేసి ఎన్నో పాపాలు సంపాదించాను కాని, ఉన్నతి కలిగించే పుణ్యాలు చేయలేదు.

నేను భూమిమీద పుట్టినందు వల్ల ప్రయోజనమేమిటి? ఏమీ కనిపించుటలేదు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ అంత్యకాలమునందు - నాయాసమున నిన్ను
దలతునో తలపనో - తలతునిపుడె
నరసింహ! నరసింహ! - నరసింహ! లక్ష్మీశ!
దానవాంతక! కోటి - భానుతేజ!
గోవింద! గోవింద! - గోవింద! సర్వేశ!
పన్నగాధిపశాయి! పద్మనాభ!
మధువైరి! మధువైరి! - మధువైరి! లోకేశ!
నీలమేఘశరీర! నిగమవినుత!

తే ॥ ఈ విధంబున నీనామ-మిష్టముగను
భజనసేయుచు నందు నా-భావమందు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నా తుది శ్వాస విడచునప్పుడు ఆయాసముతో నిన్ను ధ్యానించగలనో లేదో. ఇప్పుడే నిన్ను ధ్యానిస్తాను. నరసింహా! నరహరీ! నారసింహా! లక్ష్మీపతీ! అని అసురాంతకా! కోటి సూర్యతేజా! అని అనలేనేమో? గోవింద, గోవింద, గోవిందా! ఓ సర్వేశా! భోగీంద్రశయనా! పద్మనాభా! అని నుతించలేనేమో? మధుసూదనా!! మధువైరీ! మధుసూదనా! లోకేశా! నీలమేఘశ్యామా! వేదవినుతా! అని భజించలేనేమో.

ఈ విధముగా, ఇష్టముతో నీనామమును ఇప్పుడే భజించెదను. పైకి అనలేకపోతే నా మనస్సులోనైనా స్మరిస్తాను. నన్ను అనుగ్రహించు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ ఆయురారోగ్య పు-త్రార్థ సంపదలన్ని
కలుగజేసెడి భార-కర్త వీవె
చదువు లెస్సగ నేర్పి - సభలో గరిష్ఠాధి
కార మొందించెడి - ఘనుడ వీవె
నడక మంచిది పెట్టి- నరులు మెచ్చెడునట్టి
పేరు రప్పించెడి - పెద్ద వీవె
బలువైన వైరాగ్య - భక్తిజ్ఞానములిచ్చి
ముక్తి బొందించెడు - మూర్తి వీవె

తే ॥ అవనిలో మానవుల కన్ని-యాసలిచ్చి
వ్యర్థులను జేసి తెలిపెడి - వాడ వీవె
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ఆయుర్దాయము, ఆరోగ్యము, పుత్రులు, ధనము, సిరిసంపదలు కలుగజేసెడి భారము స్థితికారుడవైన నీవే. బాగుగా చదువు నేర్పి సభలలో విశిష్ట అధికారిని చేసెడి వాడవూ నీవే. అంతఘనుడవూ నీవే. మానవులకు మంచి నడతవు నేర్పి, పేరు ప్రఖ్యాతులస్తు తెప్పించెడివాడవూ నీవే. దృఢమైన వైరాగ్యము, జ్ఞానము, భక్తి అనుగ్రహించే తుదకు ముక్తినిప్పించే మూర్తివి నీవే.

ఈ నరులందరికీ ఆశలు కల్పించి నిరుపయోగులను చేసి పరీక్షించెడి వాడవూ నీవే కదా! అంతయూ నీ లీలయే. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ కాయమెంత భయాన-గాపాడిననుగాని
ధాత్రిలో నది చూడ- దక్కబోదు
ఏవేళ నేరోగ -మేమరించునొ? సత్త్వ
మొందంగ జేయు నే-చందముననుు
ఔషధంబులు మంచి -వనుభవించిన గాని
కర్మ క్షీణంబైన గాని- విడదు
కోటివైద్యులు గుంపు-గూడివచ్చిన గాని
మరణ మయ్యేడు వ్యాధి -మాన్పలేరు

తే ॥ జీవుని ప్రయాణకాలంబు-సిద్ధమైన
నిలుచునా దేహమందొక్క-నిమిషమైన?
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ నరహరీ! ఈ శరీరాన్ని యెంత భయపడుతూ కాపాడిననూ భూమిమీద అది నశించక తప్పదు. ఏవేళ ఏ రోగము యేమరిపాటు కలిగించునో, శారీరక యెప్పుడు హరించుకొనిపోతుందో తెలియదు. మంచి ఔషధములను సేవిస్తూ ప్రాణము నిలిచినా కర్మక్షీణిస్తేగాని ప్రాణంపోదు. ఎన్నాళ్ళో తెలియబోదు. కోటిమంది వైద్యులు కూడి వైద్యము చేసినా మరణము తప్పని వ్యాధిని మాన్పలేరు.

జీవుడి ప్రయాణ కాలము వచ్చిందంటే ఈ దేహంలో ఒక్క నిమిషమైనా నిలుస్తాడా? అది జరిగే పనికాదు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ జందె మింపుగ వేసి- సంధ్య వార్చిన నేమి
బ్రహ్మమందక కాదు-బ్రాహ్మణుడు
తిరుమణి శ్రీచూర్ణ-గురురేఖ లిడినను
విష్ణు నొందక కాదు-వైష్ణవుండు
బూదిని నుదుటను - బూసికొనిన నేమి
శంభు నొందక కాదు - శైవజనుడు
కాషాయ వస్త్రాలు -గట్టి కప్పిన నేమి
యాశ పోవక కాదు- యతివరుండు

తే ॥ ఎట్టి లౌకికవేషాలు - గట్టుకొనిన
గురుని జెందక సన్ముక్తి -దొరకబోదు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! జంధ్యమును అందముగా ధరించి, సంధ్యవార్చినంత మాత్రాన బ్రాహ్మణుడై పోతాడా? వాడికి బ్రహ్మజ్ఞానం కలిగితే బ్రాహ్మణుడైపోతాడా? వాడికి బ్రహ్మజ్ఞానం కలిగితే బ్రాహ్మణుడవుతాడు. పంగనామాలు పెట్టుకొన్నంత మాత్రాన వైష్ణవుడవుతాడా? సదా విష్ణు ధ్యానంలో వుండేవాడే వైష్ణవుడు. నుదుట విభూతి రేఖలు ధరించినంతమాత్రాన శైవుడైపోతాడా? శంకరుని చేరునా? శివభక్తివుండాలి. కాషాయ వస్త్రము కట్టినంత మాత్రాన యతి అవుతాడా? ఆశను విడనాడిన వాడే యతిశ్రేష్ఠుడవుతాడు.

లౌకికంగా యెట్టి వేషాలు వేసిననూ సద్గురు కృపలేకపోతే సన్ముక్తి లభించదు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ నరసింహ! నే నిన్ను -నమ్మినందుకు జాల
నెనరు నాయందుంచు - నెమ్మనమున
నన్ని వస్తువులు ని-న్నడిగి వేసటపుట్టె
నింకనైన గటాక్ష -మియ్యవయ్య
సంతసంబున నన్ను -స్వర్గమందే యుంచు
భూమియందే యుంచు-భోగశయన!
నయముగా వైకుంఠ -నగరమందే యుంచు
నరకమందే యుంచు -నళిననాభ!

తే ॥ ఎచట నన్నుంచిననుగాని- యెపుడు నిన్ను
మఱచిపోకుండ నీనామ-స్మరణనొసగు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ఓ నరసింహా! నేను నిన్ను నమ్మినందుకు నాయందు వాత్సల్యము నాయందుంచి నీమనసులో స్థానం వుంచు. నిన్నేవేవో కోర్కెలు కోరి విసుగు పుట్టిందయ్యా! ఇకనైనా నీకృపను అనుగ్రహించవయ్యా! ఓ నాగేంద్రశయనా! నన్ను స్వర్గంలో వుంచుతావో భూమ్మీదే పుట్టిస్తావో నీ ఇష్టం నా అదృష్టం. ఒకవేళ వైకుంఠనగరంలోనే వుంచితే నీదయ. నీవు నాకు నరకము నిచ్చినా నాభాగ్యం అంతే అని నిన్ను శరణంటాను.

నన్నెక్కడ వుంచినా నీ మఱపును మాత్రం ఇయ్యవలదు. ఓ నీరజాక్షా ఆ అనుగ్రహం చాలును. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ దేహమున్నవఱకు -మోహసాగరమందు
మునుగుచుందురు శుద్ధ-మూఢజనులు
సలలితైశ్వర్యముల్ -శాశ్వతంబనుకొని
షడ్భ్రమలను మాన-జాలరెవరు
సర్వకాలము మాయ - సంసార బద్ధులై
గురుని కారుణ్యంబు గోరుకొనరు
జ్ఞాన భక్తి విరక్తు-లైన పెద్దల జూచి
నింద జేయక- తాము నిలువలేరు

తే ॥ మత్తులైనట్టి దుర్జాతి-మనుజులెల్ల
నిన్ను గనలేరు మొదటికే -నీరజాక్ష
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! పరమ మూర్ఖులైన మానవులు ఈదేహం వున్నంత కాలము మోసాగరంలో మునకలేస్తూనే వుంటారు. అందమైన ఐశ్వర్యాలు శాశ్వతమనుకొని ఆరురకములైన భ్రమలలో నివసిస్తుంటారు. సర్వకాలములలోను మాయచే కట్టుబడి సంసార తాపత్రయంతో గురుని కృపను కోరరు. జ్ఞాన, భక్తి, వైరాగ్య సిద్ధులైన పెద్దలను జూచి నిందజేస్తూనే బ్రతుకుతారు.

మత్తు వీడని అటువంటి దుర్జనులు దుర్మదాంధులు. ఓ పద్మనయనా! అట్టి దౌర్భాగ్యులు నిన్నెప్పటికీ తెలిసికొనలేరయ్యా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ ఇలలోన నే జన్మ- మెత్తినప్పటినుండి
బహు గడించితినయ్య - పాతకములు
తెలిసి చేసితి గొన్ని - తెలియజాలక చేసి
బాధ నొందితి నయ్య - పద్మనాభ
అనుభవించెడు నప్పు-డతి ప్రయాసంబంచు
బ్రజలు చెప్పగ జాల - భయము గలిగె
నెగిరి పోవుటకునై- యే యుపాయంబైన
జేసి చూతమటన్న - జేతగాదు

తే ॥ సూర్యశశినేత్ర! నీచాటు -జొచ్చి నాను
కలుషములు ద్రుంచి నన్నేలు - కష్టమనక
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నేను ఈ భూమి మీద జన్మించిన నాటి నుంచి యెన్నెన్నో పాపముల నాచరించాను. కొన్ని పాపాలను తెలిసే చేశాను. కొన్ని తెలియక చేశాను. ఓ పద్మనాభా వాటి ఫలితంగా యెన్నియో బాధలను పొందానయ్యా! ప్రజలు తాము అనుభవించే పాపాల వలన యెంతో ప్రయాస కలుగుతున్నదని చెబుతుంటే వినటానికే నాకు భయము వేస్తున్నది. వీటిని తప్పించుకొని యెగిరిపోదామంటే ఏ ఉపాయమూ చేతకాదు.

ఓ సూర్యచంద్ర నేత్రా! నేను నీ చాటున నిలిచి నీ రక్షణ కోరుతున్నాను. కష్టమని తలచక నా పాపములను త్రుంచి వేయుము ప్రభూ! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ తాపసార్చిత! నేను - పాపకర్ముడనంచు
నాకు వంకలబెట్ట - బోకుచుమ్మి
నాటికి శిక్షలు -నన్ను చేయుటకంటె
నేడు సేయుము నీవు - నేస్తమనక
అతిభయంకరులైన -యమదూతలకు నన్ను
నొప్పగింపు మయ్య - యురగశయన!
నీ దాసులను బట్టి- నీవు దండింపంగ
వద్దు వద్దన రెంత - పెద్దలైన

తే ॥ దండ్రివై నీవు పరపీడ -దగులజేయ
వాసిగల పేరు కపకీర్తి -వచ్చునయ్య
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నేను పాపకర్మాచరణలో దిట్టను. తపములనాచరించే వారిచే అర్చించబడు దేవా! నాకు వంకలు పెట్టి ప్రయోజనమేముంది? ఏనాటి పాపాలకో నేడు నన్ను శిక్షించే కంటే నన్ను నీ నేస్తముగా భావించి ఈ నాటి శిక్షలు ఇప్పుడే వేసి శిక్షించు. ఎందుకంటే, అతి భయంకరులైన యమదూతలు పెట్టే బాధలకు నేను తాళ లేనేమో? శేషశయనా! ఇప్పుడైతే నాకు నీవు వున్నావు. నీకోసం తపస్సు చేసే నన్ను నీవే దండిస్తే ఎంత పెద్దవారలైనా నిన్ను కాదనలేరు, వద్దనలేరు.

మా తండ్రివైన నీవే మమ్మల్ని శిక్షిస్తే నీ ఆర్త రక్షక బిరుదుకే అపఖ్యాతి కాని, నాకుపోయే దేమున్నది? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ ధరణిలోపల నేను- తల్లిగర్భమునందు
బుట్టినప్పటినుండి -పుణ్యమెఱుగ
నేకాదశీవ్రతం-బెన్న దుండుగ లేదు
తీర్థయాత్రలకైన - దిరుగలేదు
పారమార్థికమైన - పనులు చేయగలేదు
భిక్ష మొక్కనికైన-బెట్టలేదు
జ్ఞానవంతులకైన - బూని మ్రొక్కగలేదు
ఇతర దానములైన - నియ్యలేదు

తే ॥ నళినదళనేత్ర! నిన్ను నే-నమ్మినాను
జేరి రక్షింపవే నన్ను-శీఘ్రముగను
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! తల్లి గర్భము నుంచి బయటపడిన నాటి నుంచి నేటి వరకు పుణ్యం కార్యములు చేయలేదు. ఒక్క ఏకాదశి నాడు ఉపవాసము వుండలేదు. పుణ్య తీర్థ యాత్రలు చేయనే లేదయ్యా! పరము నొసగే దారి గురించి ఆలోచించలేదు. ఒక్కడికి కూడా భిక్షము వేయలేదు. జ్ఞానులకు వినమృడనై మ్రొక్కలేదు. ఇతర దానముల గురించి తెలియనైతిని.

ఓ పద్మదళ నేత్రా! నిన్ను నేను నమ్ముకొన్నానయ్యా! నా కడకు చేరి నన్ను దయతో రక్షింపుము. నీవే దిక్కు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ అడవిపక్షులకెవ్వ -డాహార మిచ్చెను
మృగజాతి కెవ్వడు - మేతబెట్టె
వనచరాదులకు భో-జన మెవ్వ డిప్పించె
జెట్ల కెవ్వడు నీళ్లు - చేదిపోసె
స్త్రీల గర్భంబున -శిశువు నెవ్వడు పెంచె
ఫణుల కెవ్వడు పోసె-బరగ బాలు
మధుపాళి కెవ్వడు - మకరంద మొనరించె
బసుల కెవ్వడొసంగె - బచ్చిపూరి

తే ॥ జీవకోట్లను బోషింప - నీవెకాని
వేఱె యొక దాత లేడయ్య - వెదకిచూడ.
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! అడవిలోని పక్షులకు ఆహారమెవడిస్తున్నాడు? మృగములకు మేత యెవడు పెడుతున్నాడు? వనములో సంచరించే మానవులకు తిండి యెవరు ఇస్తున్నారు? అక్కడి చెట్లకు నీరు ఎవరు పోస్తున్నారు? స్త్రీ గర్భంలోని శిశువుకు ఆహారమిచ్చి రక్షించేదెవరు? అక్కడి పాములకు పాలుపోస్తున్నదెవరు? తుమ్మెదలకు ఏ పూలలో మకరందమున్నదో యెవరు చెబుతున్నారు? పశువులకు గడ్డిని తినమని యెవడు చెప్పినాడు?

ఈ జీవకోట్లన్నింటికీ పోషకుడు నీవుగాక మరెవరు ప్రభూ! ఎంతవెదికినా నీకంటె మరొక దాత కనబడుటలేదయ్యా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ దనుజారి! నావంటి - దాసజాలము నీకు
కోటి సంఖ్య గలరు - కొదువ లేదు
బంట్ల సందడివల్ల - బహుపరాకై నన్ను
మఱచి పోకుము భాగ్య - మహిమచేత
దండిగా భృత్యులు - దగిలి నీకుండంగ
బక్కబం టేపాటి - పనికి నగును?
నీవు మెచ్చెడి పనుల్ - నేను జేయగలేక
యింత వృథాజన్మ -మెత్తినాను

తే ॥ భూజనులలోన నే నప్ర-యోజకుడను
గనుక నీ సత్కటాక్షంబు - గలుగజేయు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ అసురవైరీ! నావంటి దాస సమూహములు నీకు కోట్ల సంఖ్యలో వున్నారు. ఆ బంటుల సందడి వలన పరాకు అధికమై నన్ను మఱచి పోవలదు. మఱి నా భాగ్యం అంతే వున్నదేమో!! నీకు అనుకూలురైన బంట్లు సమృద్ధిగా వుంటే, నావంటి ఒక్క ప్రాణి వలన నన్ను నీవు కరుణిస్తావా? నేనెందుకు ఇంతవ్యర్థమైన జన్మయెత్తితిని?

ఈ భూమిపై జన్మించిన వారందరిలో నేనే అప్రయోజకుడవు. కనుక నీ కృపను ముందు నా ఒక్కడికే దక్కుట న్యాయము. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ కమలలోచన! నన్ను - గన్నతండ్రివిగాన
నిన్ను నేమఱకుంటి - నేను విడక
యుదరపోషణకునై -యొకరి నే నాశింప
నేర నా కన్నంబు-నీవు నడపు
పెట్టలే నంటివా - పిన్న పెద్దలలోన
దగవు కిప్పుడు దీయ- దలచినాను
ధనము భారంబైన - దలకిరీటము నమ్ము
కుండలంబులు పైడి-గొలుసు లమ్ము

తే ॥ కొసకు నీ శంఖ చక్రముల్ -కుదువబట్టి
గ్రాసము నొసంగి పోషించు - కపటముడిగి
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ పద్మనయనా! నీవు నాకన్న తండ్రివి. నేను అప్రయోజకుడను. నన్ను నీవుగాక, మరెవ్వరు పోషిస్తారు? అందుకే యేమరిపాటు లేకుండా, నిన్నే ఆశ్రయించాను. నా పొట్ట కూటికి నేనెవ్వరినీ యాచించను. నాకు అన్నము నీవే పెట్టాలి. నీవు అన్నము పెట్టనంటే పెద్దల్నీ, పిన్నల్నీ పిలిచి గొడవ చేస్తాను. నా నిశ్చయం అదే. మరొక దారిలేదు నాకు. ఒకవేళ నావద్ద ధనములేకపోతే నీ తలపై కిరీటం అమ్మి ధనము తెప్పించు. పోనీ నీ చెవుల కుండలాలు అమ్మేయ్య వయ్యా! ఆ బంగారు గొలుసులు అమ్ము.

కుదువబెట్టు. చివరకు నీ శంఖ చక్రములనైన అమ్మేయవయ్యా! కాని నన్ను పోషించే భారం మాత్రము నీదే. కపటం విడచి పెట్టవయ్యా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ కువలయశ్యామ! నీ– కొలువు చేసిన నాకు
జీత మెందుకు ముట్ట–జెప్పవైతి
మంచిమాటలచేత –గొంచెమియ్యగలేవు
కలహమౌనిక జుమ్మి–ఖండితముగ
నీవు సాధువు గాన–నింత పర్యంతంబు
చనవుచే నిన్నాళ్లు – జరుపవలసె
నిక నే సహింప నీ–విపుడు నన్నేమైన
శిక్ష చేసిన జేయు – సిద్ధమయితి

తే ॥ నేడు కరుణింపకుంటివా – నిశ్చయముగ
దెగబడితి చూడు నీతోడ – జగడమునకు
భూషణ వికాస! శ్రీధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

నల్లకలువ వంటి శరీర కాంతిగల దేవా! నీ కొలువులో చేరిన నాకు జీతమెందుకు ముట్టజెప్పవు? మంచిమాటలు చెప్పి సరిబుచ్చలేవు. తెగవేసి చెబుతున్నాను. గొడవలు పెట్టుకోవద్దు. నీవు మంచివాడివి కాబట్టి ఇన్నాళ్లు పూరక వున్నాను. చనువుచే ఏదో జరిగిపోయింది. నేను సిద్ధంగా ఉన్నాను. నన్ను నీవేమి చేసినా భయంలేదు నాకు. ఇక సహించను.

నన్ను నీవు కరుణించకుంటే, తప్పక తెగబడి చెబుతున్నాను. నీతో పొట్లాట తప్పదు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ హరి! నీకు బర్యంక –మైన శేషుడు చాల
బవనము భక్షించి –బ్రతుకుచుండు
నసువుగా నీకు వా–హనమైన ఖగరాజు
గొప్పపాము నోట– గొఱుకుచుండు
అదిగాక నీ భార్య –యైన లక్ష్మీదేవి
దినము పేరంటంబు – దిరుగుచుండు
నిన్ను భక్తులు పిల్చి – నిత్యపూజలు చేసి
ప్రేమ బక్వాన్నముల్– పెట్టుచుంద్రు

తే ॥ స్వస్థముగ నీకు గ్రాసము – జరుగుచుండు
గాసు నీచేతిదొకటైన – గాదు వ్యయము.
భూషణ వికాస! శ్రీధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

ఓ హరీ! (సింహమా!) నీకు పరుండే పాన్పు ఆదిశేషుడు. పాపం ఆయన భోజనము 'గాలి', ఖర్చే లేదు. నీ వాహనము గరుత్మంతుడు. ఆయన పాముల్ని తిని బ్రతుకుతాడు. ఆయన ఖర్చుకూడా లేదు. అదీగాక మీ ఆవిడ శ్రీలక్ష్మి ప్రతి ఇంటివారు గొప్ప నైవేద్యం పెట్టి, చీరెసారెలిచ్చి పూజించే పెద్దముత్తైదువ. ఆవిడ ధనలక్ష్మి అయినా 'కానీ' ఖర్చు లేదు. ఇక నీ భక్తులు నీకు నిత్యమూ పూజలు చేస్తూ, ప్రేమగా పర్వాన్నములు నివేదిస్తుంటారు.

నీకు కావలసినవన్ని నెమ్మదిగా జరిగి పోతూనే ఉంటాయి. నీ చేతిది కాసు కూడా ఖర్చు కాదు. ఏ వ్యయమూ లేని శ్రీమంతుడవు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ పుండరీకాక్ష! నా -రెండు కన్నుల నిండ
నిన్ను జూచెడి భాగ్య-మెన్నడయ్య
వాసిగా నా మనో-వాంఛ దీరెడునట్లు
సొగసుగా నీరూపు - చూపవయ్య
పాపకర్ముని కంట - బడకపోవుదమంచు
బరుషమైన ప్రతిజ్ఞ - బట్టినావె?
వసుధలో బతిత పా-వనుడ వీవంచునే
బుణ్యవంతులనోట - బొగడ వింటి

తే ॥ నేమిటికి విస్తరించె నీ - కింత కీర్తి
ద్రోహినైనను నా కీవు- దొరకరాదె?
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ పంకజ నయనా! నిన్ను రెండు కన్నులతో యెన్నడు చూడగలనయ్యా? ఆ భాగ్యమెన్నడు స్వామీ! నా మనస్సులోని కోరిక దీరునట్లు సొగసైన నీ రూపము చూపించవయ్యా! పాపకర్ముడు కాబట్టి వీడి కంటబడకూడదని నీవు భావించావా? పరుషమైన ఇట్టి ప్రతిజ్ఞను పట్టితివా? భూమిమీద నీవు పాపులను పవిత్రులను చేయుటకు అవతరించితివని పుణ్యాత్ములు కీర్తించగా వింటిమి.

నీ కీర్తి యెందు కింత విస్తరించిందో కదా! అందుకే ద్రోహినైనను నాకు నీవు దొరకరాదా? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ పచ్చి చర్మపు దిత్తి - పసలేదు దైహంబు
లోపల నంతట - రోయ రోత
నరములు శల్యముల్ - నవరంధ్రములు రక్త
మాంసంబు కండలు - మైల తిత్తి
బలువైన యెండ వా- నల కోర్వ దింతైన
దాళలే దాకలి - దాహములకు
సకల రోగములకు - సంస్థానమై యుండు
నిలువ దస్థిరమైన - నీటిబుగ్గ

తే ॥ బొందిలో నుండు ప్రాణముల్ - పోయినంత
గాటికే గాని కొఱగాదు - గవ్వకైన
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! పసలేని ఈ దేహమున్నదే, ఇది ఒక తోట తిత్తి. దీని లోపల అంతా రోయలేని రోతయే కదా! దీంట్లో తొమ్మిది రంధ్రాలు, నరములు, ఎముకలు, మాంసము, కండలు, అన్నీ మైలతిత్తిలోనివే. ఇంతా చేసి గట్టిగా ఎండకు తాళలేదు, వానకు నిలువలేదు ఈ శరీరం. ఆకలి తట్టుకోలేదు. అంతులేని దప్పికతో వేసారుతుంది. సకల రోగములకు ఇదే సంస్థానము. నిలకడలేని అస్థిరమైన నీటి బుడగవంటిది.

ఈ దేహములోని చైతన్యమే ప్రాణము. అదిపోతే ఈ తోలు తిత్తిని కాటికి తీసికొని పోతారేకాని, ఇంట్లో యెవ్వరూ వుంచుకోరు. అందుకే ఇది గవ్వకు కూడా కొఱగానిదయ్యా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ పలురోగములకు నీ-పాదతీర్థమే కాని
వలపు మందులు నాకు - వలదు వలదు
చెలిమి సేయుచు నీకు - సేవ జేసెద గాన
నీ దాసకోటిలో - నిలుపవయ్య
గ్రహభయంబునకు జ-క్రము దలచెదగాని
ఘోరరక్షలు గట్ట-గోరనయ్య
పాముకాటుకు నిన్ను -భజన జేసెదగాని
దాని మంత్రము నేను - తలపనయ్య

తే ॥ దొరికితివి నాకు దండి వై-ద్యుడవు నీవు
వేయికష్టాలు వచ్చినన్-వెఱవనయ్య
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నాకు వున్న అనేక రోగాలకు మందు నీ దివ్యపాద తీర్థమే. అందరు కోరుకునే మందులు వలదు. సఖుడనై నీకు సేవ చేసికొనెదను. నన్ను కూడా నీదాస కోటిలో అనువించి కృతార్థుని చేయుము. ఒకవేళ గ్రహములు ప్రతికూలమైతే నీ చక్రాన్ని శరణు అంటాను కాని రక్షలు కట్టుకోను. అవెందుకు? పాము నన్ను కాటువేస్తే, నీభజనే నాకు మంత్రము. ఇతర మంత్రాలతో నాకు పనిలేదు.

నీవు నాకు దిట్టమైన వైద్యుడిగా దొరికినావు. ఇప్పుడు నాకు వేయి కష్టాలు వచ్చినా నష్టం లేదు, భయం లేదు, దుఃఖము లేదు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ కూటికోసరము నే-గొఱగాని జనులచే
బలుగద్దరింపులు -పడగవలసె?
దార సుత భ్రమ -దగిలియుండగగదా
దేశదేశములెల్ల - దిరుగవలసె?
బెను దరిద్రత పైని- బెనగియుండగగదా
చేరి నీచులసేవ-చేయవలసె?
నభిమానములు మది- నంటియుండగగదా
పరుల జూచిన భీతి-పడగవలసె?

తే ॥ నిటుల సంసారవారిధి - నీదలేక
వేయివిధముల నిన్ను నే -వేడుకొంటి
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నేను కూటికోసం పనికిమాలిన వాళ్లని సేవించవలసి వచ్చింది. వాళ్లు గదమాయిస్తుంటే సహించవలసి వచ్చింది. ఆ ప్రయత్నంలో భార్యా పుత్రులపై వ్యామోహం యేర్పడింది. వారిని పోషించటానికి దేశదేశాలు తిరుగవలసి వచ్చింది. ఈ పెద్ద దరిద్రాన్ని నెత్తిన వేసికొనబట్టే కదా! నీచుల్ని కూడా సేవించవలసి వచ్చింది. అభిమానం అనే జాడ్యం అడ్డు రావటం వలననే పరులంటే చెప్పలేని భయం పట్టుకొన్నది.

ఇక ఇటువంటి సంసార సాగరాన్ని ఈదలేక నిన్ను వేయి విధముల వేడుకొన్నాను, శరణన్నాను. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ సాధు సజ్జనులతో -జగడమాడిన గీడు
కవులతోవైరంబు -గాంచ గీడు
పరమ దీనుల జిక్క - బట్టి కొట్టిన గీడు
భిక్షగాండ్రను దుఃఖ-పెట్ట గీడు
నిరుపేదలను జూచి - నిందజేసిన గీడు
పుణ్యవంతుల దిట్ట-బొసగు గీడు
సద్భక్తులను దిర-స్కారమాడిన గీడు
గురుని ద్రవ్యము దోచు-కొనిన గీడు

తే ॥ దుష్టకార్యము లొనరించు -దుర్జనులకు
ఘనతరంబైన నరకంబు - గట్టిముల్లె
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! కీడు అనేది మా పాపముల వలననే వస్తుంది. సాధువులతోను సజ్జనులతోను పోట్లాడితే కీడు తప్పదు. కవులతో వైరము కీడు తెప్పిస్తుంది. అతిదీనులను బంధిస్తే కీడు తప్పదు. భిక్షకులను దుఃఖపెడితే కీడు కలుగుతుంది. నిరుపేదలను నిందిస్తే అది హానికరము సుమా! పుణ్యాత్ములను తిడితే కీడు సంప్రాప్తిస్తుంది. సద్భక్తులను తిరస్కరిస్తే హాని జరుగుతుంది. గురువుల సొమ్ము దోచుకొంటే కీడు తప్పదు.

దుర్మార్గమైన పనులు చేసే దురాత్ములకు ఘోరమైన నరకము కట్టుకొన్న మూటవలె వుంటుంది. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ పరులద్రవ్యముమీద- భ్రాంతి నొందినవాడు
పరకాంతల నపేక్ష- పడెడువాడు
అర్థుల విత్తంబు - లపహరించెడువాడు
దానమియ్యంగ వ-ద్దనెడివాడు
సభలలోపల నిల్చి-చాడిచెప్పెడివాడు
పక్షపు సాక్ష్యంబు - పలుకువాడు
విష్ణుదాసుల జూచి- వెక్కిరించెడివాడు
ధర్మసాధుల దిట్ట - దలచువాడు

తే ॥ ప్రజల జంతుల హింసించు - పాతకుండు
కాలకింకర గదలచే - గష్టమొందు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! పరుల ధనముపై భ్రాంతి కలిగి ఆశ పడెడివాడు, పరస్త్రీలను కామించువాడు, యాచకుల సొమ్ములను హరించేవాడు, ఒకరు దానము చేయాలనుకొంటే వద్దని దుర్బోధ చేసేవాడు, సభలలో ఇతరులపై చాడీలు చెప్పేవాడు, సాక్ష్యం చెప్పవలసి వస్తే పక్షపాత బుద్ధితో సాక్ష్యం చెప్పేవాడు, హరిదాసులను ఆక్షేపించేవాడు, ధర్మబద్ధులైన వారిని తిట్టిపోసి అవమానించాలనుకొనేవాడు.

సామాన్య ప్రజలను, జంతువులను హింసించే పాపి. వాడికి యమభటుల గదలతో దెబ్బలుతిని కష్టపడుట తప్పదు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ నరసింహా! నా తండ్రి - నన్నేలు నన్నేలు
కామితార్థము లిచ్చి - కావు కావు
దైత్యసంహార! చాల - దయయుంచు దయయుంచు
దీనపోషక! నీవె-దిక్కు దిక్కు
రత్నభూషితవక్ష!-రక్షించు రక్షించు
భువనరక్షక! నన్ను -బ్రోవు బ్రోవు
మారకోటిసురూప! - మన్నించు మన్నించు
పద్మలోచన! చేయి- పట్టు పట్టు

తే ॥ సురవినుత! నేను నీచాటు -జొచ్చినాను
నా మొఱాలించి కడతేర్చు -నాగశయన
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

నా తండ్రీ, నరసింహా! నన్నేలుము, నన్ను యేలుకొనుము. నా మనోవాంఛితము లిచ్చి రక్షించుము, కాపాడుము. ఓ రాక్షసాంతకా! దయయుంచుము, చాల దయ చూపుము. దీనులను పోషించే ప్రభూ! నీవేదిక్కు. మా దిక్కు నీవే. ఔమ్ము రత్నకాంతులతో వెలిగే దేవా! రక్షించు, రక్షించు. ఓవిశ్వ సంరక్షకా! నన్ను బ్రోవుము. బ్రోవుమయ్యా! కోటి మన్మధల సుందరాకారా! మన్నించు, నన్ను మన్నించు. ఓ పద్మనయనా! నాకు చేయూతనిమ్ము. చేదుకో ప్రభూ!

ఓ సురార్చితా! నేను నీ మఱుగును ఆశ్రయించాను. నా మొఱలను విని నన్ను కనికరించు. ఓ పన్నగశయనా! నన్ను దయతో కడతేర్చి ఆదుకోవయా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ నీభక్తులను గనుల్-నిండ జూచియు రెండు
చేతుల జోహారు-సేయువాడు
నేర్పుతో నెవరైన - నీ కథల్ చెప్పంగ
వినయమందుచు జాల- వినెడు వాడు
తన గృహంబునకు నీ-దాసులు రా జూచి
పీటపై గూర్చుండ- బెట్టువాడు
నీ సేవకుల జాతి-నీతు లెన్నక చాల
దాసోహ మని చేర - దలచువాడు

తే ॥ పరమభక్తుండు ధన్యుండు-భానుతేజ!
వానిగనుగొన్న బుణ్యంబు - వసుధలోన
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నీ భక్తులను కనులారా గాంచి చేతులు జోడించి నమస్కరించువాడు, ఎవరైనా నీ కథలు నేర్పుతో రసవత్తరంగా చెబుతుంటే వినయంతో బాగుగా వినెడివాడు, తన ఇంటికి హరిదాసులు వస్తుంటే జూచి మంచి పీటపై కూర్చుండబెట్టు వాడు, నీ సేవకులను జాతి, నీతి గురించి చింతించక, దాసోహం అని జేరవచ్చెడివాడు పరమ భక్తుడు.

ఓ సూర్యతేజా! వాడే నిజంగా ధన్యుడు. ఈ భూమిమీద అటువంటి వారిని దర్శించిన పుణ్యము కలుగుతుంది. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ పక్షివాహన! నేను -బ్రతికినన్ని దినాలు
కొండెగాండ్రను గూడి- కుమతినైతి
నన్నవస్త్రములిచ్చి - యాదరింపుము నన్ను
గన్నతండ్రివి నీవె-కమలనాభ!
మరణ మయ్యెడినాడు-మమతతో నీయొద్ది
బంట్ల దోలుము ముందు -బ్రహ్మజనక!
ఇనజభటావళి -యీడిచికొనిపోక
కరుణతో నాయొద్ద-గావలుంచు

తే ॥ కొసకు నీ సన్నిధికి బిల్చు -కొనియు నీకు
సేవకుని జేసికొనవయ్య - శేషశయన!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ గరుడ గమనా! నేను బ్రతికినంత కాలమూ చాడీలు చెప్పేవాళ్లతో తిరిగి చెడుబుద్ధి కలిగిన వాడినైయుంటిని. ఓ కమలనయనా! నాకు కన్నతండ్రివి నీవే కాబట్టి నేను బ్రతికినంతవరకు అన్న వస్త్రములకు లోటు చేయకుమయ్యా! ఆదరము చూపుము. నేను చనిపోతున్నవేళ దయతో నన్ను తీసికొని రమ్మని నీ విష్ణుభటులను పంపించు. ఓ బ్రహ్మతండ్రీ! వాళ్లను ముందే పొమ్మను. ఎందుకంటే సూర్యుని కుమారుడైన యముని భటులు నన్ను ఈడ్చుకొని పోకముందే కరుణతో నీ భటులను నాదగ్గర కాపలా వుంచుము ప్రభూ!

నీదగ్గరకు వచ్చాక నీ భటుల శిక్షణలో నేనూ నీభటుడినై నిన్ను సేవించి తరిస్తాను. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ నిగమాదిశాస్త్రముల్- నేర్చిన ద్విజుడైన
యజ్ఞకర్తగు సోమ-యాజియైన
ధరణిలోపల బ్రభా-త స్నానపరుడైన
నిత్యసత్కర్మాది-నిరతుడైన
నుపవాస నియమంబు -లొందు సజ్జనుడైన
గావివస్త్రముగట్టు - ఘనుడునైన
దండిషోడశమహా- దానపరుండైన
సకల యాత్రలు సల్పు- సరసుడైన

తే ॥ గర్వమున గష్టపడి నిన్ను-గానకున్న
మోక్ష సామ్రాజ్య మొందదు-మోహనాంగ!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

వేదవేదాంగములను చదివిన విప్రోత్తములైనా, యజ్ఞములు చేసి సోమయాజులైన వారు ప్రభాత సమయంలో స్నానమాచరించే దీక్షాపరులు, నిత్యమూ సత్కర్మలే చేసే వ్రతులు, ఉపవాస నియమంగల సజ్జనులైనను, కాషాయ వస్త్రములు గట్టు గొప్ప సన్యాసులు, షోడశదానములిచ్చిన మహామహులుగాని, అనేక తీర్థయాత్రలు చేసే ఘనులు.

గర్విష్ఠులైతే ఎంత కష్టపడినా నిన్ను గాంచలేరు. ఓ మోహనమైన శరీరముగల దేవా! ఇక మోక్ష సామ్రాజ్యము పొందగలడా? సాధ్యము కాదు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ పంజరంబున గాకి - బట్టి యుంచిన లెస్స
పలుకునే వింతైన - చిలుకవలెను?
గార్దభంబును దెచ్చి - కళ్లెమింపుగవేయ
దిరుగునే గుఱ్ఱంబు - తీరుగాను?
ఎనుపపోతును మావ- టీడు శిక్షించిన
నడచునే మదవార - ణంబువలెను?
పెద్దపిట్టను మేత-బెట్టి పెంచిన గ్రొవ్వి
సాగునే వేటాడు - డేగవలెను?

తే ॥ కుజనులను దెచ్చి నీసేవ - కొఱకు బెట్ట
వాంఛతో జేతురే భక్త - వరులవలెను?
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! కాకిని తీసికొనివెళ్లి చిలుక పంజరంలో పెట్టినంతమాత్రాన చిలుకపలుకులు పలుకుతుందా? గాడిదకు గుఱ్ఱపు కళ్ళెము బిగించినంత మాత్రాన గుఱ్ఱమువలె ఠీవిగా పరుగెత్తగలదా? దున్నపోతును తెచ్చి మావటివానిచేత అంకుశంతో పొడిపించినా మదగజము వలె నడువగలదా? గుడ్లగూబకు యెంత తిండి పెట్టినా డేగవలె యెగురగలదా?

దుర్మార్గులను తెచ్చి నీ సేవకు నియోగిస్తే నీ సద్భక్తులవలె కోరికతో సేవ చేయగలరా? తరించి తరింపజేయగలరా? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ నీకు దాసుడ నంటి - నిన్ను నమ్ముకయుంటి
గాన నాపై నేడు - కరుణజూడు
దోసిలొగ్గితి నీకు - ద్రోహ మెన్నగబోకు
పద్మలోచన! నేను - పరుడగాను
భక్తి నీపై నుంచి -భజన జేసెద గాని
పరుల వేడను జుమ్మి - వరము లిమ్ము
దండిదాతవు నీవు - తడవుసేయక కావు
ఘోరపాతకరాశి- గొట్టివైచి

తే ॥ శీఘ్రముగ గోర్కు లీడేర్చు - చింత దీర్చు
నిరతముగ నన్ను బోషించు - నెనరు నుంచు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నేను నీకు దాసుడనై యున్నాను. కాబట్టి నేడు నాపై కరుణను జూపించు. నీకు దోసిలొగ్గి నిన్ను శరణన్నాను. నాకు ద్రోహము చేయకు. నా తప్పులు మన్నించు. ఓ పద్మనేత్రా నేను నీకు పరుడను కాదు. నీపై భక్తితో నిన్ను భజిస్తాను గాని, నేను పరులను వేడుకోను సుమా! నీవే నాకు వరములిమ్ము. నీవు పుష్కలమైన దాతవు. ఆలస్యం చేయక నన్ను రక్షించు. నా ఘోర పాపాల కుప్పను పడగొట్టు.

శీఘ్రముగా నాకోర్కెలీడేర్చి నా చింతలు తొలగించు అనురాగము జూపి నన్ను నిరంతరమూ పోషించు ప్రభూ! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ విద్య నేర్చితి నంచు - విఱ్ఱవీగగలేదు
భాగ్యవంతుడ నంచు- బలుకలేదు
ద్రవ్యవంతుడ నంచు-దఱచు నిక్కగలేదు
నిరతదానములైన - నెఱపలేదు
పుత్రవంతుడ నంచు-బొగడుచుండగలేదు
భ్రుత్యవంతుడ నంచు- బొగడలేదు
శౌర్యవంతుడ నంచు - సంతసింపగలేదు
కార్యవంతుడ నంచు- గడపలేదు

తే ॥ నలుగురికి మెప్పుగానైన - నడువలేదు
నళినదళనేత్ర! నిన్ను నే-నమ్మినాను
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నేను విద్యాధికుడనని యెన్నడూ గర్వించలేదు. నేను భాగ్యవంతుడనని చెప్పుకోలేదు, అవునా? నావద్ద ద్రవ్యం వున్నదని మిడిసిపడలేదు. ఎల్లప్పుడూ దానములు చేసితినా అంటే అదీ లేదు. నా పుత్రులు ఘనులని చెప్పుకొంటినా, అంటే లేదు. నాకు లెక్కలేనంతమంది భృత్యులున్నారా అంటే లేరు. చాలా శౌర్యం ఉన్నదా అంటే అదీ లేదు. ఏమిచూచి సంతోషించమంటావు? గొప్ప కార్యసమర్థుడనూ కాదు కదా!

నలుగురు మెచ్చుకొనేటట్లు వున్నానా అంటే అదీ లేదు. ఓ పద్మదళనేత్రా! నిన్నే నమ్ముకొని కాలము గడుపుతున్నాను. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ అతిలోభులను భిక్ష -మడుగబోవుట రోత
తనద్రవ్య మొకరింట-దాచ రోత
గుణహీను దగువాని -కొలువు గొల్చుట రోత
యొరుల పంచలక్రింద-నుండరోత
భాగ్యవంతునితోడ -బంతమాడుట రోత
గుఱిలేని బంధుల -గూఢ రోత
ఆదాయములు లేక-యప్పుదీయుట రోత
జార చోరుల గూడి-చనుట రోత

తే ॥ యాదిలక్ష్మీశ! నీబంట-నైతినయ్య!
యింకనెడబాసి జన్మంబు-లెత్తరోత
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

అతిలోభితనంగల వారి దగ్గర చేయి జాచుట గొప్ప జుగుప్సను కలిగిస్తుంది. తన ధనాన్ని పరుల ఇంట దాచుట రోత. సద్గుణములు లేని వాని కొలువు పరమహేయము. ఇంకొకరి ఆశ్రయంలో బ్రతుకుట రోత కలిగిస్తుంది. భాగ్యవంతుడితో విభేదించి పంతమాడుట హానికరము. మనమంటే లక్ష్యంలేని బంధువులను కలిసి ఆశ్రయించుట రోత. ఆదాయము లేని వారు అప్పు అడుగుట జుగుప్స కలిగిస్తుంది. తిరుగుబోతు వారిని, దొంగలను కూడి తిరిగే వారి చెలిమి అతిహేయమైనది.

ఓ ఆదిలక్ష్మీ వల్లభా! నేను నీబంటునయ్యాను. నాకు నిన్ను విడచి బ్రతుకుట రోత. అందుకని యెంత శిక్షించదలచినా, నాకు అటువంటి జన్మవద్దు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ వెట్టివానికి నేల- వేదాక్షరంబులు?
మోటువానికి మంచి-పాట లేల?
పసులకాపరికేల - పరతత్త్వబోధలు?
విటకాని కేటికో- విష్ణుకథలు?
వదరు శుంఠల కేల - వ్రాత పుస్తకములు?
తిరుగు ద్రిమ్మరి కేల- దేవపూజ?
ద్రవ్యలోభికి నేల - ధాతృత్వ గుణములు?
దొంగబంటుకు మంచి- సంగతేల?

తే ॥ క్రూరజనులకు నీమీద - గోరికేల?
ద్రోహి పాపాత్మునకు దయా-దుఃఖమేల ?
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! వెట్టి చాకిరి చేసే వాడికి వేద విద్యతో పనేమిటి? మొరటువానికి మంచి సంగీతం వినిపించిన లాభమేమి? పసువుల కాపరికి పరతత్త్వపు ఆలోచన యెందుకు? విటుడికి విష్ణు కథలు వినిపించిన ప్రయోజనమేమి? ఎప్పుడూ వాగుతుండే మూర్ఖునికి మంచి గ్రంథములిచ్చి లాభమేమి? దేశదిమ్మరికి దేవుని పూజ లెందుకు? పరమలోభికి దాతృత్వం గొప్పతనం తెలుస్తుందా? దొంగతనం మఱిగిన బంటుకు నీతులు చెప్పిన లాభమేమి?

క్రూరులకు నీమీద కోరిక కలుగుట సంభవమా? క్రూరులకు, పాపాత్ములకు దయాగుణం, దుఃఖములు అంటే తెలుస్తుందా? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీ ధర్మపురినిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ నా తండ్రి నాదాత - నాయిష్టదైవమా
నన్ను మన్ననసేయు- నారసింహా!
దయయుంచు నామీద-దప్పులన్ని క్షమించు
నిగమగోచర! నాకు - నీవె దిక్కు
నే దురాత్ముడ నంచు-నీమనంబున గోప
గింపబోకుము స్వామి!- కేవలముగ
ముక్తిదాయక నీకు - మ్రొక్కినందుకు నన్ను
గరుణించి రక్షించు- కమలనాభ!

తే ॥ దండిదొర వంచు నీవెంట - దగిలినాను
నేడు ప్రత్యక్షమై నన్ను- నిర్వహింపు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ నాతండ్రీ! నా దాతా! నా ఇష్టదైవమా! నారసింహా! నాకుమన్నన జూపించుము. నా మీద దయయుంచి నా తప్పులను క్షమింపుము. వేదములతో సాక్షాత్కరించు దైవమా! నీవే నాదిక్కు. నేను దురాత్ముడనని నీ మనస్సులో ఆగ్రహించకు. ఏక పక్షముగా నిర్ణయించకుము. ముక్తిదాతా! నీకు నేను మ్రొక్కితినిగాన, కమలనాభా! నన్ను రక్షించి కరుణింపుము.

నీవే నాకు ధైర్యమిచ్చేదొరవు. నీవెంటబడినాను. నేడు నాకు దర్శనమొసగి, నన్నునెరవేరునట్లు జేయుము. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ వేమారు నీకథల్ - వినుచు నుండెడివాడు
పరుల ముచ్చటమీద -భ్రాంతిపడదు
అగణితంబుగ నిన్ను- బొగడ నేర్చినవాడు
చెడ్డమాటలు నోట-జెప్పబోడు
ఆసక్తిచేత ని-న్ననుసరించెడివాడు
ధనమదాంధులవెంట-దగుల బోడు
సంతసంబున నిన్ను -స్మరణజేసెడివాడు
చెలగి నీచులపేరు- దలపబోడు

తే ॥ నిన్ను నమ్మిన భక్తుండు - నిశ్చయముగ
గోరి చిల్లర వేల్పుల -గొల్వబోడు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! పలుమార్లు నీ పుణ్యకథలు వినుటయందు ఆసక్తికలవాడు పరుల సంభాషణల మీద అయిష్టత చూపుతాడు. భ్రాంతిలేదు, నిన్ను లెక్కలేనన్నిమార్లు కీర్తించుట నేర్చినవాడు, చెడు ప్రసంగము యెన్నటికీ చేయడు. నిన్ను ఆసక్తితో అనుసరించే భక్తుడు, ధనమదంచేత కనుగొనని వారివెంటపడి తిరుగబోడు. నిన్ను అతిసంతోషముతో స్మరించేవాడు. నీచుల పేరుకూడా తలచుటకు ఇష్టపడడు.

నిన్ను నమ్మిన భక్తుడు నిశ్చయముగా చిల్లరదేవుళ్లని స్మరించుట కూడా చేయడు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ నేనెంత వేడిన - నీకేల దయరాదు?
పలుమారు పిలిచిన - బలుక వేమి?
పలికిన నీకున్న - పదవేమిబోవు నీ
మోమైన బొడచూప-వేమి నాకు?
శరణు జొచ్చినవాని - సవరింపవలె గాక
పరిహరించుట నీకు - బిరుదు గాదు
నీదాసులను నీవు- నిర్వహింపక యున్న
బరులెవ్వరగుదురు- పంకజాక్ష!

తే ॥ దాత దైవంబు తల్లియు -దండ్రి వీవె
నమ్మియున్నాను నీపాద-నళినములను
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నేనెంత వేడుకొనినా, నీకేల దయరాదు? ఎన్నిమార్లు పిలిచినా పలుకవేమయ్యా? నాతో పలికితే నీ పదవి యేమైనా వూడుతుందా? నాకు నీమోమైన జూపవేమయ్యా? శరణు వేడిన వానిని సరిదిద్ది కాపాడాలి కదా! విడచిపెట్టుట న్యాయమా? అది ఆర్తత్రాణ బిరుదుకే అవమానము. నీ దాసులను నీవు సరిజూచుకోవాలి కదా! ఓ పద్మనయనా! పరులకు నీ బాధ్యత ఏమి పట్టింది? మరి నాగతేమిటి?

నాకు దాతవు, దైవానివి, తల్లివి, తండ్రివి కూడా నీవే. నీపాదపద్మములను నమ్ముకొని యున్నాను. “అన్యథా శరణం నాస్తి” నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ వేదముల్ చదివెడు - విప్రవర్యుండైన
రణము సాధించెడు - రాజెయైన
వర్తకకృషికుడౌ - వైశ్యముఖ్యుండైన
బరిచగించెడు శూద్ర-వర్యుడయిన
మెచ్చుఖడ్గము బట్టి -మెఱయు మ్లేచ్ఛుండైన
బ్రజల కక్కఱపడు -రజకుడైన
చర్మ మమ్మెడి కడ-జాతిమానవుడైన
నీ మహీతలమందు -నెవ్వడైన

తే ॥ నిన్ను గొనియాడుచుండెనా- నిశ్చయముగ
వాడు మోక్షాధికారి యీ -వసుధలోన
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! కులబేధాలూ, జాతి బేధాలూ కేవల్ మానవుల కల్పితాలు. నీకు అందరూ బిడ్డలే. మోక్షార్హులే. వేదాధ్యయనం చేసే బ్రాహ్మణుడైనా, రణరంగములో ఘనుడైన రాజుగారైనా, నేర్పుగా వ్యాపారము చేసే వైశ్యుడైనా, వారందరికీ సహకరించు శూద్రుడైనా, ఖడ్గవిద్యలో దిట్టయైన మ్లేచ్ఛుడైనా, ప్రజలకు గొప్ప ఉపకారియైన రజకుడైనా, చర్మముతో వ్యాపారము చేయు కడజాతి మానవుడైనా, ఈ భూమిపైన వారంతా నాబిడ్డలే.

నిన్ను కీర్తించెడి వారంతా నిశ్చయంగా మోక్షార్హులే. ఇందులో అణుమాత్రము సందేహము లేదు. ఈ వసుధలో ఇదే సత్యం. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ సకల విద్యలు నేర్చి - సభ జయింపగవచ్చు
శూరుడై రణమందు -బోరవచ్చు
రాజరాజై పుట్టి -రాజ్యమేలగవచ్చు
హేమ గోదానంబు -లియ్యవచ్చు
గగనమందున్న చు-క్కల నెంచగావచ్చు
జీవరాసుల పేళ్లు - చెప్పవచ్చు
నష్టాంగయోగము - లభ్యసింపగవచ్చు
మేక రీతిగ నాకు -మెసవవచ్చు

తే ॥ తామరసగర్భ హరపురం-దరులకైన
నిన్ను వర్ణింప దరమౌనె -నీరజాక్ష!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! సమస్త విద్యలను నేర్చిన ఘనుడు సభలతో విద్యప్రదర్శించి విజయం సాధించవచ్చును. శూరుడై రణరంగంలో విజయం పొందవచ్చును. పుట్టుకతోనే రారాజై రాజ్యమేలవచ్చును. బంగారమును, గోవులను, దానము చేయవచ్చును. ఆకాశంలో వున్న నక్షత్రములను కూడ లెక్కించవచ్చును. సమస్త జీవరాసుల పేర్లు వరుసగా చెప్పవచ్చును. అష్టాంగ యోగ విద్యల నభ్యసించవచ్చును. మేకవలె ఆకులలములను మేయవచ్చును.

పద్మసంభవుడైన బ్రహ్మ, హరుడు, ఇంద్రుడు మున్నగువారికైనా నిన్ను వర్ణింప సాధ్యమా? ఓ పద్మనయనా! అసంభవము. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ నరసింహ! నీవంటి - దొరను సంపాదించి
కుమతి మానవులనే -గొల్వజాల
నెక్కు వైశ్వర్యంబు - లియ్యలేకున్నను
బొట్టకుమాత్రము - పోయరాదె?
ఘనముగా దిది నీకు - కరవున బోషింప
గష్ట మెంతటి స్వల్ప - కార్యమయ్య?
పెట్టజాలక యేల - భిక్షమెత్తించెదు
నన్ను బీదను జేసి- నా వదేమి?

తే ॥ అమల! కమలాక్ష! నే నిట్లు - శ్రమపడంగ
గన్నులకు బండువై నీకు - గానబడునె?
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నేను నీవంటి దొరను సంపాదించుకొని దురాత్ములైన మానవులను కొలువలేను. నరసింహా! ఎక్కువ ఐశ్వర్యము నాకక్కరలేదు. నా పొట్టకూటికెంత కావలెనో అంతే ఇమ్ము ప్రభూ! కరువుతో బాధపడుతున్న నన్ను పోషించుట నీకు కష్టమైన పనియా? ఎంత చిన్నపని నీకిది. పెట్టుట లేదు, సరికదా నాచేత భిక్షము కూడా యెత్తిస్తున్నావు. నన్ను ఇంత పేదవానిగా యెందుకు సృష్టించావయ్యా?

ఓ నిర్మలుడా! పద్మనేత్రా! నేనిట్లు శ్రమపడుతుంటే, నీకు కన్నుల పండుగవలె వున్నదా? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ వనరుహనాభ! నీ-వంక జేరితి నేను
గట్టిగా నను గావు- కావుమనుచు
వచ్చినందుకు వేగ- వరము లియ్యక కాని
లేవబోయిన నిన్ను - లేవనియ్య
గూర్చుండబెట్టి నీ -కొంగు గట్టిగ బట్టి
పుచ్చుకొందును జూడు - భోగిశయన!
యీవేళ నీ కడ్డ-మెవరు వచ్చినగాని
వారికైనను లొంగి-వడకబోను

తే ॥ గోపగాడవు నీవు నా -గుణము తెలిసి
యిప్పుడే నన్ను రక్షించి - యేలుకొమ్ము
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! పద్మనాభా! నేను నీవైపున చేరాను. నన్ను గట్టిగా రక్షించుము, కాపాడుము. నీ వద్దకు వచ్చినందుకు, వేగమే వరములిమ్ము. లేకపోతే నేనిక్కడ నుంచి లేవను, నిన్ను లేవనియ్యను. నిన్ను కూర్చోబెట్టి, కొంగుగట్టిగా పట్టుకొంటాను. ఓ నాగేంద్రశయనా! చూడు తప్పక పుచ్చుకొంటాను. నీకు అడ్డమెవరు? వచ్చినా, నేను లెక్కసేయను. ఎవ్వరికీ లొంగి వణకబోను. ఎవ్వరిని లెక్కసేయను.

నాకు అసలే కోపమెక్కువ. నా గుణము నెఱిగి ఒకింత క్షమించి నన్ను రక్షించి ఏలుకో. నీవుకాక మఱింకెవరు రక్ష నాకు, నీ బిడ్డను. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ ప్రహ్లాదు దేపాటి - పైడి కానుక లిచ్చె?
మదగజం బెన్నిచ్చె - మౌక్తికములు?
నారదుండెన్నిచ్చె - నగలు రత్నంబు? ల
హల్య నీ కేయగ్ర - హారమిచ్చె?
ఉడుత నీ కేపాటి - యూడిగంబులు చేసె?
ఘనవిభీషణుడేమి - కట్నమిచ్చె?
పంచ పాండవు లేమి - లంచ మిచ్చిరి నీకు?
ద్రౌపది నీ కెంత - ద్రవ్య మిచ్చె?

తే ॥ నీకు వీరంద ఱయినట్లు - నేను గాన?
యెందు కని నన్ను రక్షింప-విందువదన!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నీకు ప్రహ్లాదుడు డెంతెంత బంగారము కానుకగా ఇచ్చాడు? వాని నెందుకు రక్షించావయ్యా? మదగజంబైన గజేంద్రుడు యెన్ని ముత్యాలు తన తలలోంచి తీసి ఇచ్చాడు. వానిని పరుగున వెళ్లి రక్షించావు. నారదుడు నీకు యెన్ని రత్నపు నగలిచ్చాడు, సదా నీ నామమే జపిస్తాడు. అహల్య నాకెన్ని అగ్రహారాలిచ్చింది స్వామీ? ఉడుత నీకేపాటి వూడిగము చేసిందని, దాని జాతికంతా నీ వేలి గుర్తులు కానుకగా ఇచ్చావు. విభీషణుడు నీకెంత కట్నం ఇచ్చాడు? పంచ పాండవులు నీకెంత లంచం ఇచ్చారు. వారికంత చేశావు? ద్రౌపది నీకెంత ద్రవ్యమిచ్చింది. ఆమె నన్నిమార్లు రక్షించావు?

నీకు వారందరూ చుట్టములా? నేను కానా? ఓ చంద్రవదనా! నన్నెందుకు రక్షించవు? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ వాంఛతో బలిచక్ర-వర్తిదగ్గర జేరి
భిక్షమెత్తితి వేల - బిడియపడక?
యడవిలో శబరి ది -య్యని ఫలాలందియ్య
జేతులొగ్గితి వేల - సిగ్గుపడక?
వేడ్కతో వేవేగ - విదురునింటికి నేగి
విందుగొంటి వదేమి- వెలితిపడక?
అడుకు లల్పము కుచే -లుడు గడించుక తేర
బొక్కసాగితి వేల - లెక్కగొనక?

తే ॥ భక్తులకు నీవు పెట్టుట - భాగ్యమౌను
వారి కాశించితివి తిండి - వాడ వగుచు.
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! కావాలని బలిచక్రవర్తి దగ్గర జేరి భిక్షమెత్తితి వెందుకయ్యా? వామనా నీకు బిడియం లేదా? రామావతారంలో శబరి పెట్టిన యెంగిలి పండ్లు తియ్యగ వున్నాయని మెచ్చుకొంటూ తిన్నావు. చేతులు జోడించావు. సిగ్గుకూడా పడలేదెందుకు స్వామీ? రారాజును కాదని విదురుని ఇంటికి వెళ్లి విందు నారగించి తృప్తి చెందావు. కృష్ణయ్యా! నీకు భక్తిప్రధానం కానీ చిన్న, పెద్ద తారతమ్యాలు లేవు. కుచేలుడు పెట్టిన అటుకులు గుప్పెడు తిని అంతులేని దరిద్రునికి అష్ట ఐశ్వర్యాలనిచ్చావు. బొక్కిన అటుకులకు భోగ భాగ్యాలిచ్చేవయ్యా?

భక్తులకు నీవు పెట్టుట సబబు, అటువంటిది నీవు వారి తిండికి ఆశించటం యేమిటయ్యా? అంత తిండిబోతువాయేమి? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ స్తంభమం దుదయించి -దానవేంద్రుని ద్రుంచి
కరుణతో బ్రహ్లాదు - గాచినావు
మకరిచే జిక్కి సా-మజము దుఃఖించంగ
గృపయుంచి వేగ ర-క్షించినావు
శరణంచు నా విభీ-షణుడు నీ చాటున
వచ్చినప్పుడె లంక - నిచ్చినావు
ఆ కుచేలుడు చేరె - డటుకు లర్పించిన
బహుసంపదల నిచ్చి - పంపినావు

తే ॥ వారివలె నన్ను బోషింప - వశముగాదె?
యింత వలపక్ష మేల శ్రీ- కాంత! నీకు?
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నీకు సంభవములో నుంచి పుట్టి దానవేశ్వరుడైన హిరణ్యకశిపుని జంపికూడా, కరుణతో వాని పుత్రుడు ప్రహ్లాదుని రక్షించినావు. మకరి చేతికి జిక్కి మృత్యు భీతితో శరణు వేడిన గజేంద్రుని దుఃఖమును బాపి, దయతో వేగంగా రక్షించినావు. శత్రువైన రావణుని తమ్ముడు విభీషణునికి శరణముతో పాటు లంకేశునిగా అభిషిక్తుని చేశావు. బాల్యమిత్రుడైన కుచేలునికి గుప్పెడు అటుకులకు ఫలముగా అష్టఐశ్వర్యముల నొసగిన శ్రీకృష్ణుడవూ నీవే.

వారివలెనే నాపై కృపజూపి రక్షించి, పోషించలేవా? ఓ శ్రీనాథా! నాపై ఇంత చిన్నచూపు దేనికి ప్రభూ? నన్నుకూడా అనుగ్రహించరాదా? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ వ్యాసుడే కులమందు - వాసిగా జన్మించె?
విదురు డే కులమందు - వృద్ధిబొందె?
గర్ణుడేకులమందు -ఘనముగా వర్ధిల్లె?
నా వశిష్టుండెందు -నవతరించె?
నింపుగా వాల్మీకి-యే కులంబున బుట్టె
గుహుడను పుణ్యుడే -కులమువాడు?
శ్రీశుకుడెక్కట - జెలగి జన్మించెను?
శబరి యేకులమందు - జన్మమొందె?

తే ॥ నే కులంబున వీరింద -తెచ్చినారు?
నీకృపాపాత్రులకు జాతి-నీతు లేల?
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! మనిషికి గుణము ప్రధానము కాని కులము కాదు. మహానుభావులదే కులమైతే నేమి? వ్యాసుడు ఏ కులంలో జన్మించి భగవానుడైనాడు? విదురుడే కులంలో పుట్టి వృద్ధినొందాడు? కర్ణుడేకులంలో దానకర్ణుని ప్రఖ్యాతి నొందాడు? ఆ వశిష్ఠ మహర్షి కుండలో పుట్టలేదా? వాల్మీకి మహర్షి బోయ కులంలో జన్మించలేదా? రామునికిష్టుడైన గుహుడు పుణ్యుడు, వాని కులమేమిటి? శ్రీశుకుని జన్మమెట్టిది? చిలుకకు పుట్టలేదా? శబరిది యేకులమని రామచంద్రమూర్తికి ఎంగిలి పండ్లు తినిపించగలిగింది?

వీరందరిది ఏ కులమని ఆలోచిస్తామా? నీకృపను పొందిన వారికి జాతి, నీతి అనే ప్రసక్తే లేదు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ వసుధాస్థలంబున– వర్ణహీనుడు గాని
బహుళ దురాచార – పరుడు గాని
తడసి కాసియ్యని – ధర్మశూన్యుడు గాని
చదువనేరని మూఢ –జనుడు గాని
సకలమానవులు మె–చ్చని కృతఘ్నుడు గాని
చూడ సొంపును లేని –శుంఠ గాని
అప్రతిష్ఠలకు లో–నైన దీనుడు గాని
మొదటికే మెఱుగని – మోటు గాని

తే ॥ ప్రతిదినము నీదు భజనచే – బరగునట్టి
వాని కే వంక లేదయ్య – వచ్చు ముక్తి.
భూషణ వికాస! శ్రీధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ఈ భూమి మీద కులము గోత్రము లేని వానికైనా, అనేక దురాచారములు కలవానికైనా, కాసుకూడా దానము చేయని అధర్మపరునికి గాని, చదువు రాని మూఢ జనునికి గాని మానవులందరిచేత తిరస్కరించబడే కృతఘ్నుడు గాని, చూచుటకు కూడా బాగుండని శుంఠయైన గాని, అప్రతిష్ఠపాలైన దీనుడు గాని మొదటి నుంచి యేమీ తెలియని మోటు మనిషిగాని.

ప్రతిదినము నీ భజన చేయుట యందు అనురక్తుడైతే, వానికి యే అభ్యంతరం వుండదు. నీవు తప్పక ముక్తినిస్తావు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ ఇభకుంభముల మీది – కెగిరెడి సింగంబు
ముట్టునే కుఱుచైన – మూషకమును?
నవచూతపత్రముల్ – నమలుచున్న పికంబు
గొఱుకునే జిల్లేడు – కొనలు నోట?
అరవిందమకరంద –మనుభవించెడి తోటి
పోవునే పల్లేరు – పూలకడకు?
లలితమైన రసాల – ఫలము గోరెడి చిల్క
మెసవునే భ్రమత ను –మ్మెత్తకాయ?

తే ॥ నిలను నీకీర్తనలు పాడ –నేర్చినతడు
పరులకీర్తన బాడునే – యరసి చూడ?
భూషణ వికాస! శ్రీధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ఏనుగు కుంభస్థలమును చీల్చి ఆ మాంసము తినే సింహము చిట్టెలుక మాంసము తింటుందా? లేత మామిడి చిగుళ్లను తినే కోకిల తన నోటితో జిల్లేడు ఆకుల కొనలు తింటుందా? పద్మములలోని మకరందాన్ని త్రాగే తుమ్మెదలు పల్లేరు పూలదగ్గరకు పోతాయా? అందమైన మధుర ఫలాలనే కొఱికి ఆనందించే చిలుక, భ్రమపడి ఉమ్మెత్త కాయను కొఱుకుతుందా?

ఇలలో నీ కీర్తనలు పాడుట నేర్చిన భక్తుడు పరులమీద పాటలు పాడుటకు ఇష్టపడునా? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ సర్వేశ! నీపాద - సరసిజద్వయమందు
జిత్త ముంపగలేను - జెదరకుండ
నీవైన దయయుంచి - నిలిచి యుండెడునట్లు
చేరి నన్నిపుడేలు - సేవకుదను
వనజలోచన! నేను - వట్టి మూర్ఖుడ జుమ్మి
నీస్వరూపము జూడ- నేర్పు వేగ
తన కుమారున కుగ్గు - తల్లి వోసినయట్లు
భక్తిమార్గం బను - పాలు పోసి

తే ॥ ప్రేమతో నన్ను బోషించి - పెంచుకొనుము
ఘనత కెక్కించు నీదాస - గణములోన.
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ సర్వేశ్వరా! నా చిత్తమును చెదరిపోకుండా నీ పాదపద్మములపై వుంచలేక పోతున్నానయ్యా! నీవైన ఈ సేవకుడిని దయతలచి అది నిలకడగా వుండునట్లు చేసి ఏలుకోవయ్యా! ఓ పంకజనయనా! నేను వట్టి మూర్ఖుండనయ్యా! వేగముగా నీ స్వరూపమును చూచే నేర్పు నాకిమ్ము. తల్లి తన కొడుకునకు ఉగ్గు యెంత ప్రేమగా పడుతుందో నాకు కూడా నీ భక్తి మార్గము అను పాలు పట్టి పోషించవయ్యా!

నన్ను ప్రేమతో పోషించి పెంచుకో స్వామీ! నీ దాస సమూహములో నన్నుకూడా చేర్చి ఘనుడిగా తీర్చిదిద్దుము. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ జీమూతవర్ణ! నీ-మోముతో సరిరాక
కమలారి యతికళం -కమును బడసె
సొగసైన నీ నేత్ర-యుగముతో సరిరాక
నళిన బృందము నీళ్ల - నడుమ జేరె
గరిరాజవరద! నీ-గళముతో సరిరాక
పెద్దశంఖము బొబ్బ - పెట బొడగె
శ్రీపతి! నీ దివ్య - రూపుతో సరి రాక
పుష్ప బాణుడు నీకు - బత్రుడయ్యె

తే ॥ నిందిరాదేవి నిన్ను మో-హించి విడక
నీకు బట్టమహిషి యయ్యె- నిశ్చయముగ
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ నీలమేఘ శ్యామా! కమలారియైన చంద్రునికి మచ్చ యెందు వచ్చింది. నీ మోమంత అందంగా తన మోము లేదని చిన్నబుచ్చుకొన్నందువలన సొగసైన కన్నులవంటి నీ నేత్రములతో సరితూగ లేక, కలువల సమూహము నీళ్ల మధ్యలోనే వుండిపోయాయి. ఓ గజేంద్రవరదా! నీ గర్జన స్వరంతో సరితూగలేక, పాంచజన్య శంఖము పెడబొబ్బలు పెట్టింది. ఓ శ్రీపతీ! నీ దివ్యమైన రూపముతో పోటీ పడలేక మన్మథుడు నీకు పుత్రుడై పుట్టి శృంగారాన్ని వృద్ధి చేస్తున్నాడు.

శ్రీలక్ష్మి నిన్ను మోహించి విడువలేక నీ హృదయములోనే తిష్టవేసికొని కూర్చున్నది. నిశ్చయంగా ఆమె నీ పట్టపు రాణియే కదా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ హరిదాసుల నింద - లాడకుండిన జాలు
　　సకల గ్రంథమ్ములు - చదివినట్లు
భిక్ష మియ్యంగద -ప్పింపకుండిన జాలు
　　జేముట్టి దానంబు- చేసినట్లు
మించి సజ్జనుల వం -చించకుండిన జాలు
　　నింపుగా బహుమాన -మిచ్చినట్లు
దేవాగ్రహారముల్ - దీయకుండిన జాలు
　　గనకకంబపు గుళ్లు - గట్టినట్లు

తే ॥ ఒకరి వర్షాశనము ముంచ - కున్న జాలు
బేరుకీర్తిగ సత్రముల్ - పెట్టినట్లు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! హరిదాసులను నిందించకుండా వుంటే సకల సద్గ్రంథాలను చదివినట్లే, భిక్షమేయక తప్పించుకోకుంటే చాలు వినయముగా దానము చేసినట్లే, అహంకరించి సజ్జనులను అవమానించకుండిన చాలు మంచిగా బహుకరించినట్లే, దేవుడి మాన్యములు అపహరించకుండిన చాలు బంగారు స్తంభాలతో గుడికట్టించినట్లే.

ఒకరి వార్షిక ఆదాయమును ముంచకుండా వుంటే చాలును, పేరు పొందిన సత్రములు కట్టించినట్లే. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ ఇహలోక సౌఖ్యము - లిచ్ఛగించెద మన్న
　　దేహమెప్పటికి దా–స్థిరత నొంద
దాయుష్య మున్న ప–ర్యంతంబు పటుతయు
　　నొక్కతీరున నుండ - దుర్విలోన
బాల్యయువత్వదు -ర్బలవార్ధకము లను
　　మూటిలో మునిగెడి -ముఱికికొంప
భ్రాంతితో దీనిగా–పాడుద మనుమొన్న
　　గాలమృత్యువుచేత - గోలుపోవు

తే ॥ నమ్మరాదయ్య! యిది మాయ - నాటకంబు
జన్మమిక నొల్ల నన్నేలు - జలజనాభ!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ఇహ లోకములోని సుఖాలన్నింటిని అనుభవిద్దామనుకొంటే ఈ దేహము యెప్పటికీ స్థిరము కాదు. ఒకవేళ ఆయుర్దాయం వున్నా, శరీరంలో పటుత్వం, ఒకేలా వుండదు. భూమిమీద వున్నంతవరకూ, ఇంతే. బాల్యము, యవ్వనము, వృద్ధాప్యము ఒకదాని వెనుక ఇంకొకటిగా వచ్చేవే. ఈ దేహం ఆ మూడింటిలో మునిగి చివరకు నశించే ముఱికి కొంప. భ్రాంతితో దీన్ని కాపాడుకొంటానని భ్రమించినా కాలమృత్యువు దీన్ని చివరకు కబళించివేస్తుంది.

దీనిని నమ్మరాదయ్యా! ఈ బ్రతుకంతా ఒక మాయా నాటకము. ఓ పద్మనయనా! నేను దీని నంగీకరించవచ్చు. నాకు ఈజన్మవద్దు. దీన్ని నీవు ఏలుకొంటావో, ఏలుకోవో నీఇష్టము. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ వదనంబు నీనామ - భజన గోరుచునుండు
జిహ్వ నీకీర్తనల్ - సేయ గోరు
హస్తయుగ్మంబు ని-న్నర్చింప గోరును
గర్ణముల్ నీ మీది - కథలు గోరు
తనువు నీసేవయే - ఘనముగా గోరును
నయనముల్ నీదర్శ -నంబు గోరు
మూర్ధమ్ము నీపద -మ్ముల మ్రొక్కగా గోరు
నాత్మ నీదై యుండు-నరసి చూడ

తే ॥ స్వప్నమున నైన నేవేళ - సంతతమును
బుద్ధి నీ పాదములయందు - బూనియుండు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నా అంగాంగములు నిన్నే కోరుకొంటాయి. నా నోరు నీనామ భజన చేయాలని కోరుతుంటుంది. నా నాలుక నీ పేరు పలుకుతూ పులకిస్తుంటుంది. నా చేతులు రెండూ నిన్ను పూజించటానికే సిద్ధము. ఇక నా చెవులకి నీ దివ్య కథలు వినాలంటే పరమప్రీతి. నా శరీరము నీ సేవ చేయాలని కోరుతుంటుంది. ఇక నా కళ్లు నీ దివ్య దర్శనం కోసం వెదుకుతుంటాయి. నా తల నీ పాదములను తాకవలెనని కాంక్షిస్తుంది. ఇక నా ఆత్మ గురించి చెప్పేదేముంది. అది నీదే.. నీ కోసమే ఆరాటపడుతుంది.

ఏ వేళ నాకు ఏ కలవచ్చినా నీవే కలలో కనిపిస్తుంటావు. ఇక నా బుద్ధి వున్నదే, అది భ్రమిస్తుంటుంది. దాన్ని క్రమశిక్షణలో పెట్టటం మాత్రం నీకు మాత్రమే తెలుసు. నా బాధ్యత నీదే. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ పద్మాక్ష! మమతచే - బరము నందెద మంచు
విఱ్ఱవీగుదుమయ్య - వెఱ్ఱిపట్టి
మాస్వతంత్రంబైన - మదము గండ్లకు గప్పి
మొగము పట్టదు కామ - మోహమునను
బ్రహ్మదేవుండైన - బైడిదేహము గల్గ
జేసివేయక మమ్ము -జెఱిచె నతడు
తుచ్ఛమైనటువంటి - తో లెమ్ముకలతోడి
ముఱికి చెత్తలు చేర్చి - మూట కట్టె

తే ॥ నీ శరీరాలు పడిపోవు - టెఱుగ కేము
కాముకుల మైతి మిక మిమ్ము - గానలేము.
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ పద్మనయనా! నీపై మమతతో ముక్తి సాధిద్దామంటూ విఱ్ఱవీగుతూ వుంటాము. అట్లా మాకు వెఱ్ఱిపడుతుంటుందయ్యా! అట్లా స్వతంత్ర భావాలతో మా కండ్లకు మదపు పొరలు గప్పి కామము, మోహము ఆపై మొహమాటం లేకుండా తగులుకొంటాయి. బ్రహ్మదేవునికైనా బంగారు దేహము లభించగానే మాకు కూడా బంగారం చెరిచేటట్లు చేశాడు. తుచ్ఛమైనట్టి తోలు, యెముకలతో చేయబడిన ఈ శరీరం. ఇది ఒక ముఱికి తొట్టి. చెత్తనంతా కుప్పపోసి మూటకట్టి ఈ భూమిపైకి పంపినావు.

ఈ శరీరాలు ఒకనాడు పడిపోతాయని గుర్తురాక మేము, కాముకులమై పోతాము. నిన్ను కూడా మఱచిపోయి మిమ్ముకూడా ధ్యానించము. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ గరుడవాహన! దివ్య - కౌస్తుభాలంకార!
రవికోటితేజ! సా-రంగవదన!
మణిగణాన్విత! హేమ-మకుటాభరణ! చారు
మకరకుండల! లస -న్మందహాస!
కాంచనాంబర! రత్న - కాంచివిభూషిత!
సురవరార్చిత! చంద్ర-సూర్యనయన!
కమలనాభ! ముకుంద! - గంగాధరస్తుత!
రాక్షసాంతక! నాగ-రాజశయన!

తే ॥ పతిత పావన! లక్ష్మీశ!- బ్రహ్మజనక!
భక్తవత్సల! సర్వేశ! - పరమపురుష!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ గరుడగమనా! దివ్య కౌస్తుభమణీ విరాజితా! కోటి రవిప్రకాశరూపా! సింహ వదనా! మణుల సమూహముచే శోభించు దేవా! బంగారు కిరీటమును ధరించిన వాడా! మకరకుండల ధారీ! ప్రకాశించెడి చిరునవ్వుగలవాడా! బంగారు వన్నెగల పీతాంబరమును ధరించెడి వాడా! రత్న ఖచితమైన మొలత్రాడు ధరించిన వాడా! సురశ్రేష్ఠులచే అర్చించబడువాడా! రవిచంద్ర నేత్రా! పద్మనాభా! ముకుందా! సదాశివునిచే సన్నుతింపబడు దేవా! ఓ దనుజాంతకా! నాగరాజైన ఆదిశేషుని తల్పముగా గలవాడా!

పతితులను పునీతులుగా చేయుదేవా! ఓ లక్ష్మీపతీ! బ్రహ్మకు జనకుడవైన ప్రభూ! భక్తులయందు వాత్సల్యము గలవాడా! సర్వేశ్వరా! ఓ పరమపురుషా! నీవు నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ పలుమాఱు దశరూప -ములు ధరించితి వేల?
యేకరూపము బొంద - వేల నీవు?
నయమున క్షీరాబ్ధి -నడుమ జేరితి వేల?
రత్నకాంచన మంది -రములు లేవె?
పన్నగేంద్రునిమీద - బవ్వళించితి వేల?
జలతారుపట్టెమం-చములు లేవె?
ఱెక్కలు గలపక్షి - నెక్కసాగితి వేల?
గజతురంగాందోళి - కములు లేవె?

తే ॥ వనజలోచన! యిటువంటి - వైభవములు
సొగసుగా నీకు దోచెనో - సుందరాంగ?
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! అనేకమార్లు దశావతారములను ధరించి నీవు ఒక్క రూపము ధరించిన చాలదా? పోనీ, పాల సముద్రంపై పవ్వళించుట దేనికి? నీవు కావాలనుకొంటే బంగారము రత్నమందిరాలెన్నిలేవు? పోనీ, నాగేంద్రుడై శేషునిపై నిద్రించుట దేనికయ్యా? నీకు పట్టు పరుపులున్న యెన్ని చక్కటి పట్టెమంచాలు లేవు? పెద్ద ఱెక్కలున్న గరుడపక్షి మీద ప్రయాణాలు దేనికి? ఏనుగులు, అశ్వములు, అందెలములు యెన్ని లేవు నీకు?

ఓ పంకజనేత్రా! ఇటువంటి వైభవములు మఱి నేను చెప్పిన వాటికేల నీ ఆమోదం కలిగింది. వాటికి అభాగ్యం యెందుకు ఇచ్చావు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ తిరుపతి స్థలమందు - దిన్నగా నే నున్న
వేంకటేశుడు మేత - వేయలేడొ?
పురుషోత్తమమునకే - బోయిన జాలు జ
గన్నాథుడన్నంబు - గడపలేడొ?
శ్రీరంగమునకు నే-జేర బోయిన జాలు
స్వామి గ్రాసము బెట్టి - సాకలేడొ?
కాంచీపురములోన - గదిసి నే గొలువున్న
గరివరదుడు పొట్ట - గడపలేడొ?

తే ॥ యెందు బోవక నేను నీ-మందిరమున
నిలిచితిని నీకు నామీద - నెనరు లేదొ
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నేనెక్కడ బ్రతికినా నా జీవితం గడచిపోతుంది. తిరుపతి వెళ్లితే అక్కడా శ్రీవేంకటేశ్వరుడవై నీవే వున్నావు. నాకు ఇంత మేత పెట్టలేవా? పురుషోత్తమము (పూరీ) వెళ్లానంటే అక్కడ జగన్నాథుడు అని ప్రసిద్ధికెక్కావు. అక్కడుంటే నా బ్రతుకు గడవదా? శ్రీరంగమునకు నేను చేరుకొన్నా చాలును రంగనాథుడు నీవేకదా! నాకు ఇంతగ్రాసము ఇచ్చి సాకలేవా? కాంచీపురము వెళ్లి అక్కడ కరివరదుడవైన నీవు వరదరాజస్వామిగా వున్నావు కాబట్టి జీవితమును గడుపుకోలేనా?

ఇదంతా నా ఊహామాత్రమే. అర్భకుడిని నేనెక్కడకు పోగలనయ్యా? చేతులు జోడించి ఇక్కడే వున్నాను. నామీద ప్రేమలేదా? నాకింకెవరున్నారు? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ తార్క్ష్యవాహన! నీవు - దండిదాత వటంచు
గోరి వేడుక నిన్ను -గొల్వవచ్చి
యర్థిమార్గము నే-ననుసరించితినయ్య
లావైన బదునాల్గు - లక్షలైన
వేషముల్ వేసి నా-విద్యాప్రగల్భత
జూపసాగితి నీకు - సుందరాంగ!
యానంద మైన నే-నడుగ వచ్చిన దిచ్చి
వాంఛ దీర్పుము - నీలవర్ణ! వేగ

తే ॥ నీకు నావిద్య హర్షంబు - గాక యున్న
తేపతేపకు వేషముల్ - దేను సుమ్మి
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

గరుత్మంతుడు వాహనముగా గలిగిన స్వామీ! నీవు సమృద్ధియైన దాతవని నేను కోరి, వేడుకతో నిన్ను గొల్చుటకు వచ్చినాను. నేను ఎన్నుకొన్న మార్గము యాచన. పైగా నిన్ను పదునాల్గు లక్షల మార్గాలలో యాచించవచ్చునట. అదే నయము కదా! అన్ని వేషాలు వేసి నా విద్యాపాటవాన్ని ప్రదర్శిస్తాను. ఓ సుందరాంగా! నేను చూప సాగినదంతా నీమెప్పునకే. ఓ నీలవర్ణా! నేనడిగినది నీ దివ్యమైన చిదానందమును. వేగమే దానినందించి కృతార్థుని చేయుము.

నీకు ఆనందము కలుగజేయని నా విద్య నిరర్థకము. ప్రతిసారీ ఒక కొత్త వేషం ఇస్తావు. ఇది నీకు వినోదమే కానీ నాకు దుర్భరం సుమా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ అమరేంద్రుని వినుత! నే - నతిదురాత్ముడ నంచు
గలలోన నైనను - గనుల బడవు
నీవు ప్రత్యక్షమై - నిలువకుండిన మానె
దొడ్డగా నొక యుక్తి - దొరకెనయ్య!
గట్టి కొయ్యను దెచ్చి - ఘనముగా ఖండించి
నీస్వరూపము చేసి - నిలుపుకొంచు
ధూప దీపము లిచ్చి - తులసితో బూజించి
నిత్యనైవేద్యముల్ - నేమముగను

తే ॥ నడుపుచును నిన్ను గొలిచెద -నమ్మి బుద్ధి
నీ ప్రపంచంబు గలుగు నా - కింతె చాలు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ఓ సురేంద్ర సన్నుతా! నేను అతి దురాత్ముడినని భావించి, కలలో కూడ కనుపించుట మానివేసినావు. నీవు ప్రత్యక్షమై నాయెదుట నిలువకున్నా సరే, నాకు మంచి యుక్తి వొకటి దొరికిందయ్యా! గట్టి కొయ్యను తెచ్చి నీ స్వరూపమును చెక్కించి నా యెదుట నిలుపుకొంటాను. దానికే ధూప, దీప, నైవేద్యాములనర్పిస్తాను. తులసి మాలలతో అలంకరిస్తాను. నియమంతో కొలుస్తూనే వుంటాను.

మనస్సులో చెదరని నమ్మికతో నిన్ను కొలుస్తూనే వుంటాను. నీ లోకంలో నాకు కొంచెము చోటు కల్పించు. నాకు ఇంతకంటె యేమీ వద్దు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ భువనేశ! గోవింద! - రవికోటిసంకాశ!
పక్షివాహన! భక్త - పారిజాత!
యంభోజభవ రుద్ర - జంబారిసన్నుత!
సామగానవిలోల! - సారసాక్ష!
వనధిగంభీర! శ్రీ-వత్సకౌస్తుభవక్ష!
శంఖచక్రగదాసి- శార్ఙ్గహస్త!
దీనరక్షక! వాసు-దేవ! దైత్యవినాశ!
నారదార్చిత! దివ్య-నాగశయన!

తే ॥ చారు నవరత్నకుండల -శ్రవణయుగళ!
విబుధవందిత పాదాబ్జ!-విశ్వరూప!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ భువనేశ్వరా! గోవిందా! కోటిసూర్యసమతేజా! గరుడ గమనా! భక్తుల అభీష్ట దీర్చు పారిజాత వృక్షమా! సంభవుడైన బ్రహ్మ, రుద్రుడు, జంభాసురుని శత్రువైన ఇంద్రునిచేత కీర్తించబడు దేవదేవా! సామగానలోలా! జలజాక్షా! జలధి గంభీరా! శ్రీవత్సము అను పుట్టుమచ్చ, కౌస్తుభము అను మణి కలిగిన పరమ పురుషా! శంఖము, చక్రము, గద, శార్ఙ్గము అను ధనస్సు ఆయుధములుగా గల శ్రీ మహావిష్ణూ! దీనరక్షకా! వాసుదేవా! దైత్యాంతకా! నారద సన్నుతా! ఆదిశేషతల్పా!

అందమైన నవరత్నఖచితకుండలధారీ! మంచి బుద్ధిమంతులచేత అర్చింపబడు పాదపద్మముల జంటగల విశ్వరూపా! వందనములు, నమో వాకములు. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ నాగేంద్రశయన! నీ–నామమాధుర్యంబు
మూడుకన్నుల సాంబ– మూర్తి కెఱుక
పంకజాతాక్ష! నీ – బలపరాక్రమ మెల్ల
భారతీపతి యైన – బ్రహ్మ కెఱుక
మధుకైటభారిక! నీ–మాయాసమర్థత
వసుధలో బలిచక్ర–వర్తి కెఱుక
పరమాత్మ! నీదగు – పక్షపాతిత్వంబు
దశశతాక్షులపురం–దరుని కెఱుక

తే ॥ వీరి కెఱుకగు నీకథల్– వింతలెల్ల
నరుల కెఱు కన్న నెవరైన –నవ్విపోరె?
భూషణ వికాస! శ్రీధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

ఓ ఆదిశేషశయనా! నీనామము యొక్క దివ్య మహిమ త్రినేత్రుడైన సాంబశివుడే యెఱుగును. ఓ పద్మనేత్రా! నీ బలపరాక్రమ మెట్టిదో సరస్వతీ దేవి భర్త అయిన బ్రహ్మదేవుని కెఱుక. మధుకైటభులకు శత్రువులైన దేవా! నీమాయా దక్షత యెట్టిదో వసుధ నేలిన బలిచక్రవర్తికెఱుక. ఓ పరమాత్మా! నీ ధర్మపక్షపాత ధోరణి సహస్రాక్షుడైన ఇంద్రునికెఱుక.

వీరందరికి తెలిసిన నీ దివ్య కథలు ఎంతో వింతగా వుంటాయి. అట్లాకాదు మానవమాత్రులైన నరులకు కూడా తెలియునంటే ఎవరైనా నవ్విపోరా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ అర్థులేమైన ని–న్నడుగవచ్చెద రంచు
క్షీరసాగరమందు–జేరినావు
నీచుట్టు సేవకుల్– నిలువకుండుటకునై
భయదసర్పముమీద–బండినావు
భక్తబృందము వెంట–బడి చరించెద రంచు
నెగసి పోయెడిపక్షి–నెక్కినావు
దాసులు నీద్వార–మాసింపకుంటకు
మంచి యోధుల కావ– లుంచినావు

తే ॥ లావు గలవాడ వైతి వే– లాగు నేను
నిన్ను జూతును నాతండ్రి! – నీరజాక్ష!
భూషణ వికాస! శ్రీధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! లోకమున గల అర్థులందరూ పరుగు పరగున వచ్చి నిన్ను అర్థిస్తారని కాబోలు నీవు క్షీరసాగరమున పవ్వళించినావు. నీచుట్టూ నీసేవకులు చేరి కొలువకుండుటకు కాబోలు నీవు భయంకరమైన శేషుని పాన్పుగా స్వీకరించినావు. నీ అసంఖ్యాక భక్తబృందాలు నీవెంటబడి రాకుండా వేగముగా ఎగిరిపోయే గరుత్మంతుని వాహనముగా స్వీకరించావు. నీ దాసులు నిన్ను ద్వారందగ్గరే నిలువరించకుండుటకై జయ విజయములనే బలిష్టులను ద్వారపాలకులుగా పెట్టుకొన్నావు.

నీవింత సామర్థ్యము గలవాడవైతివి. నేనెలాగున నిన్ను దర్శించగలను స్వామీ? నాతండ్రీ! ఇక నేను నిన్నెలా చూడగలను. నాకు దిక్కెవరు? నాగతేమిటి? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ నీకథల్ చెవులలో – సోకుట మొదలుగా
పులకాంకురము మేన–బుట్టువాడు
నయమైన నీ దివ్య–నామకీర్తనలోన
మగ్నుడై దేహంబు–మఱచువాడు
ఫాలంబుతో నీదు–పాదయుగ్మమునకు
ప్రేమతో దండమ–ర్పించువాడు
హా పుండరీకాక్ష!–హా రామ! హరి! యంచు
వేడ్కతో గేకలు–వేయువాడు

తే ॥ చిత్తకమలంబునను నిన్ను–జేర్చువాడు
నీదులోకంబునందుండు– నీరజాక్ష!
భూషణ వికాస! శ్రీధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నీ కథలు చెవులకు సోకగానే తన శరీరంపై పులకరింతలు కలుగువాడు, నయమైన నీ దివ్య నామ సంకీర్తనలో నిమగ్నుడై తన దేహాన్నే మఱచువాడు, తన నుదుటిని నీ పాదాలపై ఆనించి ప్రేమతో నీకు దండము పెట్టువాడు, ఓ పుండరీకాక్షా! ఓ రామభద్రా! ఓ హరీ! అని పిలుస్తూ వేడుకతో కేకలు పెట్టి నిన్ను పిలిచేవాడు.

తన హృదయ కమలములో నిన్ను నిలుపుకొంటాడు. నీకు ప్రియాతిప్రియమైన భక్తులు. మరి అటువంటివారు చేరేది నీలోకానికే కదా నీరజాక్షా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ నిగమగోచర నేను నీకు మెప్పగునట్లు
లెస్సగాఁ బూజింపలేను సుమ్మి
నాకుఁదోఁచిన భూషణములు పెట్టెదనన్నఁ
గౌస్తుభమణి నీకుఁగలదు ముందె
భక్ష్యభోజ్యముల నర్పణముఁజేసెద నన్న
నీవు పెట్టితి సుధ నిర్జరులకుఁ
గలిమికొలది గానుకల నొసంగెద నన్న
భార్గవీదేవి నీ భార్యయయ్యె

తే ॥ నన్ని గలవాఁడ వఖిల లోకాధిపతివి!
నీకు సొమ్ములు పెట్ట నేనెంతవాఁడ!
భూషణ వికాస! శ్రీధర్మ – పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

వేదములచే దర్శించబడెడి దేవా! నీకు మెప్పుగలుగునట్లు బాగుగా పూజింపలేను సుమా! నాకు తోచిన మణిఆభరణములు చేయించుదామంటే, నీకు ఇదివఱకే కౌస్తుభమణి వున్నది. దానిని మించినది నేనెక్కడి నుండి తేగలను? భక్ష్యములను, భోజ్యములను పెట్టి అర్పణగావించెదనా అంటే, నీవు జర(వార్ధక్యము) పీడించని దేవతలకు అమృతమునే ఇచ్చావు. ఇక నేను నివేదించేవి ఏపాటివి? నాకు వున్న కలిమినంతా వినియోగించి నీకు కానుకలు అర్పిద్దామా అంటే, స్వయంగా లక్ష్మీదేవి నీ భార్య అయింది. ఆ తల్లితో నాకు పోటీ సాధ్యమా?

నీవు అన్నీ కలిగినవాడవు. సమస్త లోకాలకు అధిపతివి. నీకు ఆభరణములనర్పించుటకు నేనేపాటి ధనవంతుడను? ఏపాటి సమర్థుడను? నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ నవ సరోజదళాక్ష! నన్నుఁబోషించెడు
దాతవు నీవంచు ధైర్యపడితి
నా మనంబున నిన్ను నమ్మినందుకుఁదండ్రి!
మేలు నా కొనరింపు నీలదేహ!
భళిభళీ! నీయంత ప్రభువు నెక్కడఁజూడఁ
బుడమిలో నీపేరు పొగడవచ్చు
ముందుఁజేసిన పాపమును నశింపఁగఁజేసి
నిర్వహింపుము నన్ను నేర్పుతోడఁ

తే ॥ బరము సంతోషమాయె నా ప్రాణములకు
నీ ఋణము దీర్చుకొననేర నీరజాక్ష
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

ఓ నూతనముగా వికసించిన పద్మదళనేత్రా! నన్ను పోషించేదాతవు నీవు కాక పరులెవ్వరున్నారు. అదే ధైర్యంతో నేను నిర్భయంగా వున్నాను. తండ్రీ! నా మనస్సులో నిన్ను నమ్మినందుకు నాకు నీవు మేలుజేయవయ్యా! నీలవర్ణదేహా! నీకు నా విన్నపమిదే ప్రభూ! భళిరా నారసింహా! నీఅంత గొప్ప ప్రభువును నేనెక్కడ జూడలేదయ్యా! ఈ పుడమిపై నీపేరు యెప్పుడైనా యెక్కడైనా స్మరించవచ్చును. పూర్వజన్మలలో నేను చేసిన పాపములను నశింపజేసి నన్ను నిర్వహించుకో ప్రభూ! నన్ను నేర్పుతో రక్షించుకో.

నా ప్రాణములకు పరమ సంతోషంగా వున్నది. ఓ నీరజాక్షా! నేను నీ ఋణము తీర్చుకోలేనయ్యా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ ఫణుల పుట్టల మీఁదఁ బవ్వళించిన యట్లు
పులుల గుంపునఁజేరఁబోయిన యట్లు
మకరి వర్గంబున్న మడుఁగఁ జొచ్చినయట్లు
గంగ దాపున నిండ్లు గట్టినట్లు
చెదల భూమిని చాడు చెరగు బఱచినట్లు
ఓటిబిందెలఁబాల నునిచినట్లు
వెట్టివానికిఁ బహువిత్త మిచ్చినయట్లు
కమ్మగుడిసె మందుఁగాల్చినట్లు

తే ॥ స్వామి నీ భక్తవరులు దుర్జనులతోడఁ
జెలిమిఁజేసిన యట్లైనఁజేటు వచ్చు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి–దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! ప్రహ్లాదుని చరిత్రవలన తెలిసినదేమంటే, నీవు నీ ద్వేషులనైనా మన్నిస్తావు కానీ నీ భక్తులకు చెడు చేస్తే సహించవు. అది పాముపుట్టలమీద పరుండుట వంటిది. పులుల గుంపులతో తిరుగుట మంచిది. మొసళ్ళు గుంపులుగా వున్న మడుగులోకి దిగుట వంటిది. గంగానది ఒడ్డున నిద్రించుట వంటిది. చిల్లు ఉన్న బిందెతో పాలు తీసికొని పోవుట వంటిది. వెట్టివానికి చాలా ధనము ఒప్పగించుట వంటిది. పూరి గుడిసెలో మందు కాల్చి తయారు చేసినట్లు అతి తెలివిమాలిన పని.

ప్రభూ! నీభక్త శిఖామణులు దుర్జనులతో చేరితే చెలిమి చేస్తే పైన చెప్పినవన్నీ జరిగినట్లే భావించవచ్చును. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ దనుజసంహార! చక్ర-ధర! నీకు దండంబు
లిందిరాధిప! నీకు - వందనంబు
పతితపావన! నీకు -బహునమస్కారముల్
నీరజాతదళాక్ష!-నీకు శరణు
వాసవార్చిత! మేఘ-వర్ణ నీకు శుభంబు
మందరధర! నీకు - మంగళంబు
కంబుకంధర! శార్ఙ్గ -కర! నీకు భద్రంబు
దీనరక్షక! నీకు- దిగ్విజయము

తే ॥ సకలవైభవములు నీకు-సార్వభౌమ!
నిత్యకల్యాణములు నగు-నీకు నెపుడు
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ దనుజాంతకా! చక్రధారీ! నీకు దండముల నర్పింతును. ఓ ఇందిరాధిపా! నీకు వందనములు. ఓ పతితపావనా! నీకు పెక్కు నమస్కారములు. ఓ పద్మదళాక్షా! నీకు శరణు. ఓ సురేంద్రపూజితా! నీలమేఘమా! నీకు నిత్యశుభమగుగాక! ఓ మందరగిరి ధారీ! నీకు మంగళమగు గాక! శంఖమువంటి కంఠముగల శారంగపాణీ! నీకు భద్రమగు గాక!

ఓ దీనరక్షకా! నీకు దిగ్విజయమగుగాక! ఓ సార్వభౌమా! నీకు సకల వైభవములు కలుగుగాక! నీకు ఎప్పుడూ నిత్య కల్యాణములు జరుగుగాక! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ మత్స్యావతారమై - మడుగులోపల జొచ్చి
సోమకాసురు ద్రుంచి-చోద్యముగను
దెచ్చి వేదము లెల్ల- మెచ్చ దేవతలెల్ల
బ్రహ్మకిచ్చితివీవు- భళి! యనంగ
నా వేదముల నియ్య- నాచారనిష్ఠల
ననుభవించుచు నుందు-రవనిసురులు
సకలపాపంబులు-సమసిపోవునటంచు
మనుజులందఱు నీదు-మహిమ దెలిసి

తే ॥ యుందు రరవిందనయన! నీ-యునికి దెలియు
వారలకు వేగ మోక్షంబు-వచ్చు ననఘ!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

స్వామీ! నీవు మత్స్యావతారము ధరించి సముద్ర గర్భమునకు బోయి అక్కడ దాగిన సోమకాసురుని జంపి వాడు దొంగిలించిన వేదములను చోద్యముగా తీసికొని వచ్చి దేవతలందరూ మెచ్చుకొనునట్లు బ్రహ్మదేవునికి ఇచ్చినావు. ఆయన తిరిగి అట్టి దురవస్థ రాకుండా కంఠోపాఠము చేయమని బ్రాహ్మణులను ఆదేశించాడు. ఈనాటికీ వేదము నిలిచింది వేదరక్షకుడవైన నీవలననే. ఆచార నిష్ఠలతో వేదపఠన జరగాలని నియమించావు. అటువంటి వారికీ ముక్తినిస్తానని నచ్చజెప్పావు.సకల పాపములు సమసిపోతాయని పలికినావు. ఆవిధంగా జనులందరకు వేదము తద్వారా నీ మహిమ తెలిసింది.

ఓ పద్మాక్షా! ఓ అనఘా! ఆవిధంగా అందరికీ మోక్షార్హతనిచ్చి చరితార్థులను చేశావు. నీకు అన్ని జాతులవారు, మతములవారు సమానులే. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ కూర్మావతారమై - కుధరంబుక్రిందను
గోర్కితో నుండవా- కొమరు మిగుల?
వరాహావతారమై-వనభూములను జొచ్చి
శిక్షింపవా హిర-ణ్యాక్షునపుడు?
నరసింహమూర్తివై -నరభోజను హిరణ్య
కశిపుని ద్రుంపవా- కాంతి మీఱ?
వామనరూపమై-వసుధలో బలిచక్ర
వర్తి నఱంపవా-వైర ముడిగి?

తే ॥ యిట్టి పనులెల్ల జేయగా- నెవరికేని
తగునె నరసింహ! నీకిది - దగును గాక!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ప్రభూ! నీవు నాడు (దేవదానవుల సాగర మథన సమయమున) కూర్మావతారమై కుధరంబు క్రింద (మందర పర్వతము అడుగున) చేరి ఇష్టపూర్వకముగా వుండవా? ఆ విధముగా నీ ప్రౌఢత్వమును చూపితివి కదా! వరాహావతారమున నీటి అడుగునకు బోయి భూమిని యెత్తి హిరణ్యాక్షుని వధించి శిక్షించినావు. నరసింహమూర్తివై అసురుడైన హిరణ్యకశిపుని, వాడి వరములన్నీ వమ్ముజేసి కాంతులు విరజిమ్ముతూ చంపినావు. వామనమూర్తివై బాలవటునిగా బలిచక్రవర్తిని యాచించి, శత్రుత్వము లేకుండా త్రిజగములను సంపాదించావు.

ఎవ్వరికైనా ఇటువంటి పనులు చేయుట సాధ్యమా? ఎన్నటికీ సాధ్యము కాదు. నరసింహా! అసాధ్యమయ్యా! నీవేదైనా నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ లక్ష్మీశ! నీదివ్య-లక్షణగుణముల
వినజాల కెప్పుడు-వెఱ్ఱినైతి
నా వెఱ్ఱిగుణములు -నయముగా ఖండించి
నన్ను రక్షింపు మో-నళినేత్ర!
నిన్నునే నమ్మితి-నితరదైవములనే
నమ్మలేదెప్పుడు -నాగశయన!
కాపాడినను నీవె- కష్టపెట్టిన నీవె
నీపాదకమలముల్-నిరత మేను

తే ॥ నమ్మియున్నాను నీపాద- నళినభక్తి
వేగ దయచేసి రక్షింపు - వేదవేద్య!
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ లక్ష్మీపతీ! నా చిత్తచాంచల్యం వలననే యెప్పుడు నీ దివ్య లక్షణ గుణములను వినుటకు సుముఖత కనబఱచని వెఱ్ఱివాడనయ్యాను. ఓ పద్మనేత్రా! అటువంటి నా వెఱ్ఱి గుణములు నయముగా ఖండించుము. నిన్నే నమ్ముకొన్నాను. నీకు మాత్రమే ఇది సాధ్యము, నీవే రక్షించాలి. ఓ నాగశయనా! నేను మరియే దేవతలను ఆశ్రయించను. నీవే నాకు శరణ్యము. నమ్మిన వానిని రక్షించుట నీ కర్తవ్యము. నన్ను కాపాడినా నీవే, కష్టపెట్టినా నీవే. నీ ఇష్టము. నీ పాదపద్మములనే ఆశ్రయించాను.

నీ పాదపద్మములపై భక్తినిలిపి, నేను నిన్నే నమ్మియున్నాను. వేదములచే తెలియబడు దేవా! వేగముగా నాపై దయజూపి రక్షించుము. నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

సీ॥ అమరేంద్రవినుత! ని-న్ననుసరించినవారు
ముక్తిబొందిరి వేగ-ముదముతోను
నీపాదపద్మముల్-నెఱ నమ్మియున్నాను
నాకు మోక్షంబిమ్ము -నళిననేత్ర!
కాచి రక్షించునన్-గడతేర్చు వేగమే
నీ సేవకుని జేయు-నిశ్చలముగ
గాపాడినను నీకు-గైంకర్యపరుడ నై
చెలగి నీపనులను - జేయువాడ

తే ॥ ననుచు బలుమాఱు వేడెద-నబ్జనాభ!
నాకు బ్రత్యక్ష మగుము నిన్- నమ్మినాను
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

ఓ దేవేంద్ర సన్నుతా! నిన్నే అనుసరించేవారు. ముక్తిని పొందినారు. సంతోషంతో సత్వరమే మోక్షమిచ్చావు. నేను నీ పాదపద్మములనే సదా నమ్మియున్నాను. ఓ పద్మనాభా! వేగముగా నీదరికి చేర్చుకోవయ్యా ఇంకేమీ కోరను. నన్ను రక్షించు, రక్షించు, రక్షించు. వేగముగా కడతేర్చును. నిశ్చలమైన నీ సేవకునిగా నన్ను తీర్చిదిద్దుకో. నన్ను కాపాడితే జీవితాంతం నిన్ను సేవిస్తూ వుంటాను. నీ సేవలన్నీ చేసికొంటూ వుంటాను. ఇట్లు పలుకుతూ నిరంతరము నిన్ను సేవిస్తాను.

నిన్నే నమ్ముకొన్నాను, నాకు ప్రత్యక్షము కావయ్యా! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.



సీ॥ శేషప్ప యను కవి - చెప్పిన పద్యముల్
చెవుల కానందమై - చెలగుచుండు
నే మనుజుండైన - నెలమి నీ శతకంబు
భక్తితో విన్న స-త్ఫలము గలుగు
జెలగి యీ పద్యముల్-చేర్చి వ్రాసినవారు
వివరించి పద్యముల్ విడిగ వ్రాసినవారు
కమలాక్షుకరుణను - గాంతు రెపుడు
నింపుగా బుస్తకం-బెపుడు బూజించిన
దురితజాలంబులు - దొలగిపోవు

తే ॥ నిట్ట పుణ్యాకరంబని - యెపుడు జనులు
గష్టమెన్నక పఠియింప - గలుగు ముక్తి.
భూషణ వికాస! శ్రీధర్మ - పురనివాస!
దుష్టసంహార! నరహరి-దురితదూర!

**భావదీపిక :**

శేషప్ప అని పిలువబడే కవి చెప్పిన పద్యములు చెవులకు ఆనందమిచ్చి అతిశయింప జేయును. ఈ శతకమును ఏ మానవుడైన భక్తితో వింటే సత్ఫలితములను పొందుతాడు. ఈ పద్యములను చేర్చి ఒక్కచోట చక్కగా వ్రాసినవారు (వివరించినవారు) కమలాక్షుడైన నారసింహుని కరుణకు పాత్రత బొందెదరు. ఈ పుస్తకమును పూజా మందిరంలో వుంచి, పూజించే వారికి పాపముల రాసులు, తొలగిపోతాయి.

ఎప్పుడూ జనులు దీనిని పుణ్యముల జలధి అనే భావనతో పఠింతురు గాక! కష్టమని భావించక నిత్య పారాయణ చేయువారికి 'ముక్తి' కలుగు గాక! నగలతో కాంతులు విరజిమ్మే శ్రీధర్మపురి నిలయా, నరహరీ! ఓదుష్టాంతకా! నీవు పాపములను దూరముచేయు తండ్రివి.

# అంకితం



సీ॥ కలలోన కనుపింప కన్నీరు కాల్వలౌ

కనుపింప కుంటివి కన్నతండ్రి!

మఱతును నిన్నెట్లు మరణమొచ్చిన దాక

ఈ జన్మకింతియే ఈశ్వరేచ్ఛ

నీ ఆత్మ శాంతికై నే జేయగలిగింది

చేస్తాను నాయనా! చింతవలదు

నరసింహుడే తల్లి నరసింహుడే తండ్రి

గురుడును దైవంబుకూడ "హరియె"

తే ॥ అంకితము దీని నిత్తును ఆత్మ శాంతి

కాశికందించు రక్షణ కరుణ జూపు

భూషణ వికాస శ్రీధర్మపురి నివాస

దుష్ట సంహార నరసింహ తోడు నీవె.



రచయిత

# అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




| | | |
|---|---|---|
| పిలవండి | : | అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు |
| పుట్టింది | : | 9-6-1945 |
| చదివింది | : | ఎం. టెక్. |
| ఉండేది | : | ఫ్లాట్ నెం. 5, ప్లాటు నెం. 61, సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్దార్థనగర్, |
| రంధి | : | భగవన్నామ సంకీర్తన |
| నచ్చింది | : | శాస్త్రీయ సంగీతం |
| నచ్చంది | : | నక్కజిత్తులు |
| మెచ్చింది | : | సజ్జన సాంగత్యం |
| రింగండి | : | +91 9393021360 |
| చదవండి | : | www.geetadeeksha.com |
| ఇవ్వండి | : | e-mail : www.geetadeeksha@gmail.com |